# అనాలోచిత సేంద్రీయ సాగు నిర్ణయంతో రావణకాష్టంగా మారిన శ్రీలంక..!

శ్రీలంకలో మే – ఆగష్టు 2021 మాసాల మధ్య (యల సీజన్) విత్తనాలు నాటడానికి సమాయత్తం అవుతున్న లంక రైతాంగానికి ఏప్రిల్ 2021లో ప్రభుత్వ ప్రకటించిన సేంద్రీయ సాగు (ఆర్గానిక్ ఫామింగ్) విధానం ఆశనిపాతంలా మారింది. శ్రీలంక ప్రభుత్వం అనాలోచిత, అశాస్త్రీయ, ఆఘమేఘాల మీద తీసుకున్న 'రసాయన ఎరువుల వాడకాన్ని, దిగుమతులను నిషేధించడం' అనే నిర్ణయంతో రైతాంగం అయోమయంలో పడి సాంప్రదాయ సాగు పద్ధతులకు స్వస్తి పలకడం అనివార్యం అయ్యింది. శ్రీలంకలో ప్రధాన పంటగా వరి సాగు అవుతున్నది. 1960ల్లో వచ్చిన హరిత విప్లవం తరువాత ఇండియా తో పాటు శ్రీలంక కూడా వరి పంట ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధించడం జరిగింది. సేంద్రీయ సాగు దిగుబడులను అధిక ధరలకు విదేశాలకు ఎగుమతి చేయవచ్చని, దేశ ఆర్థిక స్థితి స్వల్పకాలంలోనే బలోపేతం అవుతుందని ప్రభుత్వం నమ్మింది. చైనా ఉదారంగా అప్పులు ఇవ్వడంతో నాటి పాలకులకు రానున్న ఉపద్రవం కనిపించలేదు. వ్యవసాయ శాస్త్రవేత్తలు హెచ్చరించినా పట్టించుకోని ప్రభుత్వం రసాయన ఎరువుల దిగుమతులను పూర్తిగా నిషేధించింది.

అనాదిగా శ్రీలంక అవలంభిస్తున్న సంప్రదాయ 'కాడ్యన్ హోం గార్డెన్ వ్యవస్థ', 'చెన్నై కల్టివేషన్ వ్యవస్థ'ల ద్వారా దిగుబడులు పెరగడమే కాకుండా జీవవైవిధ్యం, పర్యావరణం కూడా పరిరక్షించబడేవి. రసాయన ఎరువుల నిషేధంతో వ్యవసాయ దిగుబడులు 40 శాతం, టీ ఆకుల ఉత్పత్తి 40 శాతం పడిపోయాయి. నవంబర్ 2021 నాటికి ప్రభుత్వం చేసిన పెద్ద తప్పు బోధపడడం ప్రారంభమైంది. కరోనా అలలతో సతమతం అవుతున్న ప్రజలకు ఆహార కొరత ఉరితాడులా మారింది. నెమ్మదిగా ప్రభుత్వం వద్ద ఉన్న విదేశీమారక నిధులు కరిగి పోవడం, ప్రజల్లో ఆకలి కేకలు మిన్నంటడం క్రమంగా పెరిగాయి. ఆహార ధాన్యాల కొరతతో నిత్యవసరాల ధరలు చుక్కలనంటాయి. తాను చేసిన తప్పును గుర్తించిన ప్రభుత్వం రసాయన ఎరువులపై విధించినా నిషేధాన్ని పాక్షికంగా ఎత్తి వేయడం జరిగింది. ఆహార ధాన్యాల ధరలు పెరగడం, కొరత ఏర్పడడంతో శ్రీలంక ఆర్థిక వ్యవస్థ కుప్పకూలడం చూస్తుండగానే జరిగిపోవడంతో 55 బిలియన్ యూయస్ డాలర్ల విదేశీ అప్పులు కట్టలేని దుస్థితి ఏర్పడింది.

గోరు చుట్టుపై రోకలి పోటులా ఫిబ్రవరి 2022లో ప్రారంభమైన ఉక్రెయిన్ రష్యా యుద్ధం శ్రీలంక ఆకలి అగ్నికి ఆజ్యం పోసినట్లు అయ్యింది. గోధుమలు, వంట నూనెలు, ముడి చమురు లాంటి అవసరాలను తీర్చగల ఉక్రెయిన్, రష్యా దేశాలు నుంచి యుద్ధం కారణంగా దిగుమతులు ఆగిపోవడంతో ప్రపంచ దేశాలు ఆర్థికంగా కుంగి పోవడం చూసాం. ముడి చమురు దిగుమతులకు కావలసిన విదేశీమారక నిల్వలు లేకపోవడంతో ప్రజలు కిమీల మేరకు క్యూలను కట్టి పెట్రోల్, డిజిల్, రేషన్ పొందాల్సిన దుస్థితి ఏర్పడింది.

సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిందే. కాని దానికి ముందు రైతులను, నేలను, సాగు పద్ధతులను సిద్ధం చేయడానికి కావలసినంత సమయం తీసుకోవాలి. రసాయన ఎరువులకు అలవాటు పడిన మట్టిని సేంద్రియ సాగు వైపు మళ్లించడానికి శాస్త్రజ్ఞుల సలహాలు తీసుకోవాలి. సేంద్రియ సాగు చేసే రైతులకు రాయితీలను అందిస్తూ ఆర్థిక చేయూత ఇవ్వాలి. ఇలాంటి దీర్ఘ కాల పథకాల అమలుతో నెమ్మదిగా రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించుకుంటూ, ఆరోగ్యకర సేంద్రీయ దిగుబడులు పెంచడం జరగాలి. నేడు భారతదేశంలో సిక్కిం రాష్ట్రం మాత్రమే పూర్తి సేంద్రియ సాగు పద్ధతులను అవలంభిస్తున్నది. ఈ రైతాంగానికి భారత ప్రభుత్వం తగిన ఆర్థిక సహాయం చేస్తున్నది. సేంద్రీయ సాగు దిగుబడులకు తగిన కనీస మద్దత్తు ధరలను కల్పించడం, పంపిణీ వ్యవస్థలను నెలకొల్పడం, మార్కెటింగ్ సౌకర్యాలు అందుబాటులో ఉంచడం జరుగుతోంది.

భారత ప్రభుత్వం సేంద్రీయ సాగు విధానాన్ని క్రమంగా, శాస్త్రీయంగా తీసుకువస్తున్నది. వ్యవసాయ శాస్త్రవేత్తలు తరుచుగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం, రైతుల వెన్నంటి ఉండడంతో భారత దేశంలో సేంద్రియ వ్యవసాయ దిగుబడులు క్రమంగా పెరుగుతున్నాయి. భారత ప్రభుత్వం సేంద్రీయ ఎరువులు, జీవ ఎరువులు (బయో ఫర్టిలైజర్స్), రసాయన ఎరువుల వాడకం సమతుల్యంగా జరగడమే కాకుండా పెద్ద ఎత్తున 'సాయిల్ హెల్త్ కార్డు'ల ప్రయోగాలను విజయవంతంగా చేస్తూనే రైతుల వెంట రక్షణగా నిలుస్తున్నది. దీని ఫలితంగా భారత ప్రభుత్వం 2020–21లో 1,040 మిలియన్ యూయస్ డాలర్ల విలువగల 59,908 మెట్రిక్ టన్నుల సేంద్రీయ ఆహార ఉత్పత్తులను (51 శాతం అధికంగా తృణధాన్యాలు, మిలెట్స్) ఎగుమతి చేయగలిగింది. నేడు 58 దేశాలకు సేంద్రీయ ఆహార ఉత్పత్తులను భారత్ ఎగుమతులు చేస్తున్నది. కరోనా అలలు, యుద్ధ నీడలు భారత ఆహార ఉత్పత్తుల దిగుబడులను ఏమాత్రం తగ్గించలేక పోయాయి. సాయిల్ హెల్త్ కార్డుల సహాయంతో వ్యవసాయ నిపుణులు సమయానుకూలంగా రైతులకు కావలసిన సలహాలు (ఉత్పత్తి నుంచి మార్కెటింగ్ వరకు) ఇవ్వడం సత్ఫలితాలకు దారి తీసాయి. ఇదే క్రమంలో భారత్‌లో అవలంభిస్తున్న నీమ్–కోటెడ్ యూరియా, నానో–ఫర్టిలైజర్స్ వాడకం మంచి మార్పులకు నాంది పలుకుతోంది.

సేంద్రీయ వ్యవసాయం వైపు రైతాంగాన్ని సమాయత్తం చేయడానికి భారత ప్రభుత్వం నెమ్మదిగా, స్థిరంగా, శాస్త్రీయంగా, సఫలంగా అడుగులు వేస్తూ ఇతర దేశాలకు ఆదర్శంగా నిలుస్తున్నది. అనాలోచితంగా, అశాస్త్రీయంగా, అత్యంత వేగంగా సేంద్రీయ సాగును ప్రవేశపెట్టిన శ్రీలంక ప్రభుత్వం నేడు ప్రపంచ దేశాల ముందు దీనంగా, ఘోర దుస్థితిలో నిలబడింది. నేల నాణ్యతను రక్షించుకుంటూనే సేంద్రియ సాగు వైపు వడి వడిగా అడుగులు వేయడానికి ప్రభుత్వ యంత్రాంగం, రైతాంగం, శాస్త్ర సమాజం సమన్వయంతో కృషి చేయాల్సి ఉంటుంది. ఒకేసారి సేంద్రీయ సాగు వైపు మారితే ఏమవుతుందో తెలియడానికి శ్రీలంక ఓ చేదు ఉదాహరణగా చరిత్ర పుటల్లో నిలుస్తుంది. నిదానమే ప్రధానం, అడుగు వేసే ముందు ఆలోచన, నెమ్మదిగా సుస్థిరాభివృద్ధి దిశ వైపు పయనం, శాస్త్ర సమాజ సలహాలకు కట్టుబడి ఉండడం లాంటి సూత్రాలను మరువకుండా సుస్థిర సేంద్రియ సాగు పద్ధతులకు పట్టం కడదాం, లోక ఆకలిని తరివే అన్నామృతాన్ని అందించే కర్షక లోకానికి అండగా ఉందాం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## పి.వి. సింధు గారి ని ఆమె తొలిసారిగా సింగపూర్ ఓపెన్ టైటిల్ ను గెలుచుకొన్నందుకు అభినందించిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, జులై 18: పి.వి. సింధు గారు తొలి సారి గా సింగపూర్ ఓపెన్ టైటిల్ ను గెలుచుకొన్న సందర్భం లో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆమె కు అభినందన లు తెలిపారు. ఇది దేశానికి ఒక గర్వకారణమైన ఘడియ అని, అంతేకాకుండా వృద్ధిలోకి వస్తున్నటువంటి క్రీడాకారుల కు ఇది ప్రేరణ ను కూడా అందించగలదని శ్రీ నరేంద్ర మోదీ అన్నారు.

కంద్ర క్రీడాశాఖ మంత్రి శ్రీ అనురాగ్ సింహ్ ఠాకుర్ చేసిన ఒక ట్వీట్ కు ప్రధాన మంత్రి సమాధానంగా తాను మరొక ట్వీట్ లో ?

తొలిసారి గా సింగపూర్ ఓపెన్ టైటిల్ ను గెలుచుకొన్న సందర్భం లో ఆమె కు ఇవే నా అభినందన లు. ఆమె తన అసాధారణ క్రీడా ప్రతిభ ను మరో మారు చాటిచెప్పారు, తద్ద్వారా సఫలత ను సాధించారు. ఇది దేశాని కి ఒక గర్వకారణమైనటువంటి ఘడియ; అంతేకాదు, ఈ కార్యసాధన అనేది వృద్ధి లోకి వస్తున్నటువంటి క్రీడాకారుల కు ప్రేరణ ను కూడా అందిస్తుంది." అని పేర్కొన్నారు.

## కేవీఐసి చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన శ్రీ మనోజ్ కుమార్

న్యూఢిల్లీ, జులై 18: కేవీఐసి చైర్మన్ గా శ్రీ మనోజ్ కుమార్ 2022 జూలై 15 శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం మాట్లాడిన శ్రీ మనోజ్ కుమార్ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆశిస్తున్న ఆత్మ నిర్భర్ భారత్ సాధనకు ప్రాధాన్యత ఇచ్చి బాధ్యతలు నిర్వర్తిస్తానని శ్రీ మనోజ్ కుమార్ తెలిపారు. స్వావలంబన భారతదేశ నిర్మాణం కోసం సాధ్యమైనంత ఎక్కువ సంఖ్యలో చిన్న మరియు సూక్ష్మ యూనిట్ల స్థాపనకు కేవీఐసి అమలు చేస్తున్న వివిధ పథకాల ద్వారా సహకారం అందిస్తామని అన్నారు. స్వావలంబన భారతదేశ నిర్మాణం కోసం ఎక్కువ ఉపాధి అవకాశాలను అందించేందుకు ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. యువత ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా ఉద్యోగాలు ఇచ్చే శక్తిగా అభివృద్ధి సాధించాలన్నది కేవీఐసి లక్ష్యమని శ్రీ మనోజ్ కుమార్ పేర్కొన్నారు.

గతంలో కేవీఐసి ఎక్స్‌పర్ట్ మెంబర్ (మార్కెటింగ్)గా పనిచేసిన శ్రీ మనోజ్ కుమార్ మార్కెటింగ్ మరియు గ్రామీణాభివృద్ధి రంగాల్లో అపారమైన అనుభవం కలిగి ఉన్నారు. ప్రధాని నేతృత్వంలో దేశంలో ఖాదీ "నిశ్శబ్ద విప్లవం"లా వ్యాపిస్తోందని ఆయన అన్నారు . గత 8 ఏళ్లలో "ఖాదీ ఇండియా" అత్యద్భుతమైన విజయాలు సాధించిందని ఆయన అన్నారు.

ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయం నేరుగా హస్తకళాకారులకు అందేలా చూసేందుకు చర్యలు తీసుకుంటామని శ్రీ మనోజ్ కుమార్ తెలిపారు. దీనివల్ల వెనుకబడిన వర్గాలకు చెందిన వారు ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తారని,బలహీన వర్గాలకు చెందిన వారు ఆర్థిక స్వావలంబన సాధిస్తారని అన్నారు. ప్రతి హస్త కళాకారుడికి చేతినిండా పని దొరికేలా చూసేందుకు తమ సంస్థ చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు.

ఖాదీ ఇండియా బ్రాండ్‌ను నూతన శిఖరాలకు తీసుకెళ్లేందుకు తాను "సబ్కా సాత్, సబ్‌కా వికాస్" మరియు "ఖాదీ ఫర్ నేషన్, ఖాదీ ఫర్ ఫ్యాషన్ మరియు ఖాదీ ఫర్ ట్రాన్స్‌ఫర్మేషన్" అనే మంత్రాన్ని అనుసరిస్తానని శ్రీ మనోజ్ కుమార్ చెప్పారు . " భారతదేశంలో ప్రజాదరణ పొందిన విధానంగా ప్రపంచ స్థాయిలో ఖాదీకి ప్రాచుర్యం లభించేలా చూసే అంశానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది. ఖాదీని "లోకల్" నుంచి "గ్లోబల్"గా మార్చడం లక్ష్యంగా కార్యక్రమాలు అమలు జరుగుతాయి. సంస్థ అమలు చేసే చర్యల వల్ల ప్రపంచవ్యాప్తంగా ఖాదీకి డిమాండ్ గణనీయంగా పెరుగుతుంది" అని శ్రీ మనోజ్ కుమార్ చెప్పారు.

## టీఎస్ ఎంసెట్ పరీక్షలు ప్రారంభం.. కరెంట్ లేక వరంగల్‌లో గంట ఆలస్యంగా ఎగ్జామ్ షురూ!

హైదరాబాద్, జులై 18:టీఎస్ ఎంసెట్ పరీక్షలు ఇవ్వాల ప్రారంభమయ్యాయి. వరంగల్ జిల్లాలోని గణపతి ఇంజినీరింగ్ కాలేజీలో కరెంటు లేకపోవడంతో గంట ఆలస్యంగా ఎగ్జామ్ ప్రారంభమైనట్టు తెలుస్తోంది. అయితే.. ఇక్కడ ఉన్న జనరేటర్ కూడా పనిచేయడం లేదని అందుకే ఆలస్యంగా ప్రారంభించినట్టు అధికారులు అంటున్నారు. షెడ్యూల్ ప్రకారం.. ఉదయం 9 గంటల నుంచి 12 వరకు కంప్లీట్ కావాల్సి ఉండగా.. మధ్యాహ్నం 1.30 అయినా పరీక్ష పూర్తి కాలేదు. కరెంటు లేక, కంప్యూటర్స్ పనిచేయక విద్యార్థులు ఇక్కట్లు పడ్డారు. దీనిపై విద్యార్థుల పేరెంట్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైతే పరీక్ష కేంద్రంలోని అనుమతించబోమని కండిషన్స్? పెట్టిన అధికారులు.. దీనికి ఏం సమాధానం చెబుతారని నిలదీస్తున్నారు.

## కోట్ పల్లి ప్రాజెక్ట వద్ద పర్యాటకుల సందడి..

హైదరాబాద్, జులై 18: కోట్ పల్లి ప్రాజెక్క్ట వద్ద పర్యాటకులు సందడి నెలకొంది. ఈ వర్షాకాలంలో తొలి సారి కోట్ పల్లి ప్రాజెక్ట్ నిండి అలుగు పారటంతో పర్యాటకులు సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. వివిధ ప్రాంతాల నుండి స్నేహితులతో పర్యాటకులు కోట్‌పల్లికి చేరుకుని ఉల్లాసంగా గడిపారు.

ప్రాజెక్ట్‌లో బొట్ల షికారు చేయటం కనిపించింది. ప్రాజెక్ట్ ప్రాంతం అంత పర్యాటకులతో కిటకిట లాడింది. పర్యాటకులు కోట్‌పల్లి ప్రాజెక్ట్ పరిసర ప్రాంతాలలో భోజనాలు చేస్తు ఆట పాటలతో ఉల్లాసంగా గడిపారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఎంతొ సంతోషంగా గడిపారు.



# 200 కోట్ల టీకామందు డోజుల సంఖ్యను మించిపోయిన సందర్భంలో పౌరులకు అభినందనలు తెలియజేసిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, జులై 18: విజ్ఞనశాస్త్రం పట్ల విశేషమైనటువంటి విశ్వాసాన్ని చాటిచెప్పినందుకు మరియు 200 కోట్ల కోవిడ్–19 టీకామందు డోజుల ప్రత్యేక సంఖ్య ను దాటిపోయినందుకు భారతదేశం ప్రజానీకాన్ని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రశంసించారు. అలాగే, ఈ ఉద్యమం లో పాలుపంచుకొన్న వైద్యులు, నర్సు లు, ఫ్రంట్ లైన్ వర్కర్స్, శాస్త్రవేత్తలు, నూతన ఆవిష్కర్తలు మరియు నవపారిశ్రామిక వేత్తల ఉత్సాహాన్ని, వారి దృఢ సంకల్పాన్ని ఆయన మెచ్చుకొన్నారు.

కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ మన్ సుఖ్ మాండవియ చేసిన ఒక ప్రకటన కు సమాధానం గా ప్రధాన మంత్రి ఒక ట్వీట్ లో –

"భారతదేశం మరో సారి చరిత్ర ను సృష్టించింది. 200 కోట్ల వేక్సీన్ డోజుల విశిష్ట సంఖ్య ను దాటిపోయిన సందర్భం లో భారతీయులు అందరి కి ఇవే అభినందన లు. భారతదేశం యొక్క టీకాకరణ కార్యక్రమాన్ని స్థాయి లోన, వేగం లోన సాటిలేని విధం గా కొనసాగించడానికి తోడ్పాటు ను అందించిన వారిని చూస్తూ ఉంటే మనసు గర్వం తో ఉప్పొంగిపోతున్నది. కోవిడ్–19 కి వ్యతిరేకంగా ప్రపంచం సలుపుతున్న పోరాటాన్ని ఈ ఘట్టం బలోపేతం చేసివేసింది.

టీకామందు ను తీసుకొనే కార్యక్రమం కొనసాగుతున్నంత కాలం భారతదేశ ప్రజానీకం విజ్ఞానశాస్త్రం పట్ల విశేషమైనటువంటి విశ్వాసాన్ని చాటారు. భూ గ్రహాన్ని భద్రమైందిగా ఉంచడం కోసం పూచీ పడటం లో మన వైద్యులు, నర్సు లు, ఫ్రంట్ లైన్ వర్కర్స్, శాస్త్రజ్ఞ?లు, నూతన ఆవిష్కర్తల తో పాటు నవ పారిశ్రామిక వేత్త లు ఒక ముఖ్య పాత్ర ను పోషించారు. వారి ఉత్సాహాన్ని మరియు వారి యొక్క దృఢ సంకల్పాన్ని నేను ప్రశంసిస్తున్నాను." అని పేర్కొన్నారు.

# 2022వ సంవత్సరంలో పార్లమెంటు వర్షకాల సమావేశాలు మొదలవడానికంటే 5ముందు ప్రధాన మంత్రి చేసిన ప్రకటన పాఠం

న్యూఢిల్లీ, జులై 18: ఈ సమావేశాల కు వాతావరణం తో సంబంధం ఉన్నది. ఇప్పుడు దిల్లీ లోనూ వర్ష రుతువు తన ప్రవేశాన్ని ఆరంభించేసింది. అయినప్పటికీ బయటి ఉష్ణోగ్రత తగ్గడం లేదు; సభ లోపల సైతం వేడిమి తగ్గుతుందా తగ్గదా అన్నది తెలియదు. ఈ కాలఖండం ఒక విధం గా చాలా ముఖ్యమైనటువంటిది గా ఉంది. ఎలాగంటే ఇది మనం 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' ను జరుపుకొంటున్న కాలం మరి. ఆగస్టు 15వ తేదీ కి ఒక విశేషమైన ప్రాముఖ్యం ఉన్నది; భారతదేశాని కి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత, దేశం మరో 25 సంవత్సరాల కు ఎప్పుడైతే శతాబ్ది వేడుక ను జరుపుకొంటుందో, ఈ 25 సంవత్సరాల కాలం లోనూ మన ప్రయాణం ఎలా ఉండాలి?, మనం ఎంత వేగం గా ముందుకు వెళ్ళగలం? సరికొత్త శిఖరాల కు ఏ విధం గా మనం చేరుకోగలం? అనే వాటి విషయం లో మనం ఒక ప్రణాళిక ను సిద్ధం చేసుకోవలసి ఉంది. ఈ కాలం ఆ తరహా సంకల్పాల ను చెప్పుకొని, ఆయా సంకల్పాల కు అంకితమై, దేశాని కి ఒక దిశ ను ఇవ్వడానికి సంబంధించింది. సభ దేశాని కి నాయకత్వాన్ని వహించవలసి ఉంది. దేశ ప్రజల లో నూతన శక్తి ని నింపడం కోసం సభ లోని గౌరవనీయులైన సభ్యులంతా ఒక సాధనం వలె మారాలి. అందువల్ల, ఈ సమావేశాలు ఆ దృష్టికోణం లో నుంచి చూసినప్పుడు చాలా ప్రాముఖ్యం కలిగినవి గా ఉన్నాయి.

ఈ సమావేశాలు మరో కారణం గా కూడా కీలకం. అది ఎలాగంటే, ఇదే కాలఖండం లో రాష్ట్రపతి పదవి కి మరియు ఉప రాష్ట్రపతి పదవి కి ఎన్నికలు జరుగనున్నాయి. ఈ రోజు న వోటింగు కూడా కొనసాగుతున్నది. మరి ఇదే కాలఖండంలో కొత్త రాష్ట్రపతి మరియు కొత్త ఉపరాష్ట్రపతి ల పదవీకాలం కూడా మొదలై వారి మార్గదర్శనం ఆరంభం అవుతుందన్నమాట.

సభ ను భావ ప్రసారం తాలూకు ఒక ప్రభావశీల మాధ్యమం గాను, తీర్థ క్షేత్రం గాను మనం ఎల్లవేళ ల భావిస్తాం; ఎక్కడయితే అరమరికల కు తావు ఉండనటువంటి బుద్ధి తో చర్చ జరుగుతుందో, చర్చోపచర్చ లు సాగి, విమర్శ లు కూడా చోటు చేసుకొని మరి సమగ్ర విశ్లేషణ ద్వారా విధానాల లోను, నిర్ణయాల లోను అతి సకారాత్మకతమైన తోడ్పాటు లభిస్తుందో.

సభ ను వీలైనంత మేరకు ఫలప్రదం గా, నిర్మాణాత్మకం గా తీర్చిదిద్దడానికి కలసి రావలసిందంటూ మాన్య ఎంపి లు అందరి కి నేను విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ కారణం గా ప్రతి ఒక్కరు వారి వారి ప్రయత్నాల ద్వారా మాత్రమే ప్రజాస్వామిక విలువల ను వర్ధిల్ల జేయగలుగుతారు. అందరి కృషి తో సభ ముందుకు సాగుతుంది. ప్రతి ఒక్కరి ప్రయాసల తోనే సభ ఉత్తమ నిర్ణయాన్ని తీసుకోగలుగుతుంది. మరి ఇందువల్ల, మనం సభ యొక్క హుందాతనాన్ని మెరుగు పరచడానికి గాను మనం మన విధుల ను నెరవేర్చుతూనే దేశ ప్రజల హితం కోసం వీలున్నంత ఎక్కువ స్థాయి లో ఈ సమావేశాల ను వినియోగించుకోవాలి. స్వేచ్ఛ కోసం ఎవరైతే వారి జీవనం లోని యవ్వన దశ తో పాటు వారి యావత్తు జీవనాన్ని కూడాను సమర్పణం చేశారో, వారి జీవనాన్ని కారాగారం లో గడిపివేశారో, ఎంతటి త్యాగాల కు సిద్ధపడ్డారో అటువంటి వారు కన్న కలల ను మనం నెరవేర్చవలసిన అవసరం ఉందని మనం సదా జ్ఞాపకం పెట్టుకోవాలి. వారి స్వప్నాల ను దృష్టి లో పెట్టుకొని, ఆగస్టు 15వ తేదీ సమీపిస్తుండగా మనం సభ ను సర్వాధిక సకారాత్మక రీతి లో ఉపయోగించుకొనేటట్టు చూడవలసి ఉంది. నేను ఆశపడుతున్నది ఇదే.

# భజన కళాకారులూ కార్మికులే- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



తిరుపతి, జులై 18: తిరుమల తిరుపతి దేవస్థానంలో భజన కళాకారులుగా ఉన్న వారి సేవలను కొనసాగించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ అన్నారు. కళాకారులు కూడా సమాజం ప్రగతిలో భాగస్వామ్యం అవుతున్నారని చెప్పారు. భక్తి పార్వశ్యంతో భజనలు చేసే కళాకారులు కూడా కార్మికులే అని తాము భావిస్తామని స్పష్టం చేశారు. భజనలు చేసే వారిని కళాకార్మికులుగా గుర్తించాలి అని టిటిడి యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. దేవస్థానంలో పని చేస్తున్న వేలాది మంది శాశ్విత ఉద్యోగుల మాదిరిగానే అంకిత భావంతో భక్తితో కళా కార్మికులు సేవలు అందిస్తారని పేర్కొన్నారు. శాశ్వత ఉద్యోగుల మాదిరి కళాకారులను మానవత్వంతో చూడాలని కోరారు. వారి సమస్యను పరిష్కరించాలని చెప్పారు. శాశ్వత ఉద్యోగుల మాదిరి వేతనాలు పెంచమని బోనస్ లు ఇవ్వమని కళాకారులు డిమాండు చేయడం లేదని చెప్పారు. తమ భక్తి విశ్వాసాలు ప్రదర్శించే అవకాసంతో పాటు కొంచెం ఆర్థిక సహాకారం మాత్రం అందించాలని యాజమాన్యానికి సూచించారు.

దేవుడు కోరుకునేది కూడా అదే కదా అంటూ వ్యాఖ్యానించారు. టీటీడీ యాజమాన్యం, ఈవో ధర్మారెడ్డి, చైర్మన్ సుబ్బా రెడ్డిల నాయకత్వాన కళాకారులకి మంచి అవకాశాలు అందాలని పేర్కొన్నారు. వారి సేవలను కొనసాగిస్తామని యాజమాన్యం ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. తాము కమ్యూనిస్టులమే అయినా సమాజంలో భాగమేనని ఎదుటివారి భక్తిని కాదనలేమని పేర్కొన్నారు. శ్రమ శక్తికి తాము అండగా ఉంటామని అది కర్మాగారంలో పని చేసిన కార్మికులయినా, రైతాంగం అయినా కళా కార్మికులు అయినా తాము శ్రమ శక్తిగానే చూస్తామని స్పష్టం చేశారు. ఈ విషయంలో తాను కొన్ని సందర్భాలలో వివాదస్పదం అవుతానని భక్తికి కాదు భక్తి రూపంలో సేవలో ఉన్న కార్మికులకు తమ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు.

టీటీడీలో పని చేస్తున్న కార్మికులకు అన్ని విధాలా అండగా ఉంటామని.. వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. జానపద వృత్తి కళాకారుల సంగం ఆధ్వర్యంలో దాదాపు 40 వేల మంది బజన కళాకారులు పాల్గొన్నారు. వారికి నాయకత్వంవహించి సమస్తను బలోపేతంగా నడిపిస్తున్న శ్రి పులి మామిడి యాదగిరి నారాయణ అభినందించారు.

## వరద బాధితులతో కలిసి భోజనం చేసిన మంత్రి సత్యవతి.. ఏటూరునాగారం పునరావాస కేంద్రం పరిశీలన



ములుగు, జులై 18 (నేటినిజం ప్రతినిధి): ములుగు జిల్లా, జుఅ ఏటూరునాగారంలో ఏర్పాటు చేసిన వరద బాధితుల పునరావాస కేంద్రాన్ని మంత్రి సత్యవతి రాథోడ్ సోమవారం పరిశీలించారు. పునరావాస కేంద్రంలో బాధితులను పరామర్శించారు. అక్కడి పరిస్థితులను, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారుల నుంచి వారికి అందుతున్న సహకారం, పునరావాస ఏర్పాట్లు, భోజన వసతులపై ఆరా తీశారు. ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈసందర్భంగా వరద బాధితులకు భోజనం వడ్డించి, వారితో కలిసి భోజనం చేశారు. వరద బాధితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి సత్యవతి భరోసా ఇచ్చారు. మంత్రి వెంట ములుగు జడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్వర్, కలెక్టర్ కృష్ణ ఆదిత్య, ఐటీడీఏ పీవో అంకిత్ తదితరులున్నారు.

## లంచం కేసులో వ్యవసాయ మంత్రిత్వ శాఖ ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారిని, మరో ముగ్గురు ప్రైవేట్ వ్యక్తులను అరెస్టు చేసిన సిబిఐ,

న్యూఢిల్లీ, జులై 18: సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ఒక ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్, డైరెక్టరేట్ ఆఫ్ ప్లాంట్ ప్రొటెక్షన్, క్వారంటైన్ ఒ స్టోరేజ్ డిపార్ట్‌మెంట్, వ్యవసాయ మంత్రిత్వ శాఖ (భారత ప్రభుత్వం), విశాఖపట్నం తో పాటు విశాఖపట్నంలో ఉన్న ఒక ప్రైవేట్ కంపెనీ రీజినల్ మేనేజర్‌తో సహా ముగ్గురు ప్రైవేట్ వ్యక్తులను లంచం తీసుకుంటుండగా కేంద్ర నేర పరిశోధన సంస్థ సిబిఐ అరెస్టు చేసింది.

విశాఖపట్నం లోని ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్, డైరెక్టరేట్ ఆఫ్ ప్లాంట్ ప్రొటెక్షన్, క్వారంటైన్ ఒ స్టోరేజ్ డిపార్ట్‌మెంట్, వ్యవసాయ మంత్రిత్వ శాఖ (భారత ప్రభుత్వం), తో పాటు విశాఖపట్నంకు చెందిన ఒక ప్రైవేట్ కంపెనీ రీజినల్ మేనేజర్‌పై కేసు నమోదు చేశారు. ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్, విశాఖపట్నం, డైరెక్టరేట్ ఆఫ్ ప్లాంట్ ప్రొటెక్షన్, క్వారంటైన్ ఒ స్టోరేజ్ డిపార్ట్‌మెంట్, వ్యవసాయ మంత్రిత్వ శాఖ (భారత ప్రభుత్వం) ఫైటోసానిటరీ సర్టిఫికేట్‌ల జారీ కోసం అఊంలు, ఫ్యూమిగేటర్లు, షిప్పింగ్ ఏజెంట్ల నుండి వస్తువులను ఎగుమతి చేయడం, దిగుమతి చేసుకున్న సరుకుల కోసం సరుకుల విడుదల ఆర్డర్‌ల విషయంలో భారీ మొత్తంలో లంచాలు డిమాండ్ చేసి వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి.

పెండింగ్‌లో ఉన్న దరఖాస్తును క్లియర్ చేసినందుకు, వ్యవసాయ వస్తువుల దిగుమతి/ఎగుమతి సరుకులను విడుదల చేయడానికి కస్టమ్స్ కు అనుకూలమైన ధృవీకరణ పత్రాన్ని జారీ చేసినందుకు విశాఖపట్నంలోని ఒక ప్రైవేట్ కంపెనీ ప్రాంతీయ మేనేజర్ నుండి ప్రభుత్వోద్యోగి అక్రమ ఆదాయాన్ని కోరినట్లు ఆరోపణలు వచ్చాయి.

విశాఖపట్నంలోని ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్, ప్రైవేట్ కంపెనీ రీజనల్ మేనేజర్‌ను సీబీఐ అదుపులోకి తీసుకుని, లంచంగా తీసుకున్న రూ. 6000/–.ను స్వాధీనం చేసుకున్నారు

విశాఖపట్నం, కాకినాడ, రూర్కీ (ఉత్తరాఖండ్)లో నిందితులు, వారి సహచరుల, ఇతరుల ఇళ్లలో సోదాలు జరిగాయి. రూ.1,29,63,450/– (సుమారు.) కు పైబడిన నగదు ప్రభుత్వాధికారి నివాస ప్రాంగణంలో రూ. 56,86,000/– (సుమారు.) సదరు అధికారికి చెందినట్లుగా ఆరోపిస్తూ ఇతర ప్రాంగణాల నుండి మరికొంత నగదు స్వాధీనం చేసుకున్నారు. కొన్ని నేరారోపణ పత్రాలు కూడా స్వాధీనం చేసుకున్నారు.

అరెస్టయిన నిందితులందరినీ ఈరోజు విశాఖపట్నంలోని సీబీఐ కేసుల ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి కోర్టు ముందు హాజరుపరచనున్నారు.

## 20, 21 తేదీల్లో పోలవరం ప్రాంతాల్లో సిపిఐ పర్యటన..

అమరావతి, జులై 18: గోదావరి నదికి వరదలు సంభవించి పోలవరం పరిసర ప్రాంతాలు ముంపుకు గురైన నేపథ్యంలో ఈ నెల 20, 21 తేదీల్లో సిపిఐ ప్రతినిధి బృందం పోలవరం ముంపు ప్రాంతాల్లో పర్యటించనుంది. సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ, అఖిల భారత కిసాన్ సభ జాతీయ అధ్యక్షులు రావుల వెంకయ్య, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి ఓబులేసు తదితరుల ప్రతినిధి బృందం పోలవరం ముంపు ప్రాంతాల్లో పర్యటించనుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ తెలిపారు. ఎగువన కురిసిన భారీ వర్షాల కారణంగా గోదావరి నదికి తీవ్రమైన వరదలు సంభవించాయని, గత వందేళ్లలో ఎన్నడూ లేని విధంగా పోలవరం ప్రాజెక్టుకు వరద పోటెత్తిందన్నారు. పోలవరం ఎగువ కాపర్ డ్యాం ఎత్తుకు మించి వరద నీరు వచ్చిందని, ఈ వరదల కారణంగా పోలవరం ముంపు గ్రామాలు, లంక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.పోలవరం నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, పునరావాసం కల్పించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన నిర్లక్ష్యం ఫలితంగా వేలాది మంది నిర్వాసితులు నిరాశ్రయులై, పునరావాస కేంద్రాల్లో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారాన్ని ఏళ్ల తరబడి గాలికి వదిలి పాలకులు చోద్యం చూస్తున్నారని, ప్రభుత్వాల తీరు వల్ల తుఫాన్లు, వరదలు సంభవించిన పరిస్థితుల్లో నిర్వాసితులు భయం గుప్పెట్లో మగ్గుతున్నారని, విపరీతమైన వరదలవల్ల గ్రామాల ముంపునకు పాలకుల తప్పదమే ప్రధాన కారణమని ఆరోపించారు.

# రాష్ట్రపతి ఎన్నికలో ఓటేసిన ఏపీ సీఎం జగన్.. టీడీపీ అధినేత చంద్రబాబు




అమరావతి, జులై 18: రాష్ట్రపతి ఎన్నికల సందర్భంగా ఏపీ అసెంబ్లీలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఏపీ సీఎం వైఎస్ జగన్‌తో పాటు మంత్రులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఏపీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రులు రోజా, తానేటి వనిత, బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, వైసీపీ ఎమ్మెల్యేలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటేసిన టీడీపీ అధినేత చంద్రబాబు

రాష్ట్రపతి ఎన్నికల సందర్భంగా ఏపీ అసెంబ్లీలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఓటు వేశారు. చంద్రబాబు తమ ఎమ్మెల్యేలతో కలిసి పార్టీ కార్యాలయం నుంచి అసెంబ్లీకి చేరుకుని ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఆయనతో పాటు ఎమ్మెల్యే, టీడీపీ ఏపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర తదితరులు ఓటు హక్కును వినియోగించు కున్నారు.

# తొలి రోజే రాష్ట్రపతి ఎన్నికల్లో దక్కిన ఓటు.. సీఎం కేసీఆర్ కల్పించిన అదృష్టమే : ఎంపీ వద్దిరాజు



ఖమ్మం, జులై 18: (నేటినిజం ప్రతినిధి): భారత అత్యున్నత ప్రజాస్వామిక వేదిక అది.. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఎందరో రాజకీయ ఉద్దండులు ఆ వేదికకు ప్రాతినిధ్యం వహించారు.. అక్కడ జరిగిన అనేక చారిత్రక పరిణామాలకు అలనాటి యోధాను యోధులంతా ప్రత్యక్ష సాక్షులుగా నిలిచారు. అలాంటి ఉద్దండుల సరసన చోటు దక్కించుకున్న వద్దిరాజు రవిచంద్ర మరోసారి చరిత్రకెక్కారు. ఖమ్మం జిల్లా నుంచి రాజ్యసభ ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తూ.. ఆయన సోమవారం పార్లమెంటులో అడుగు పెట్టిన తొలిరోజే.. భారత 16వ రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు హక్కు దక్కించుకున్నారు. దీంతో ఆయన ఒకే రోజున రెండు చారిత్రక సంఘటనల్లో నమోదయ్యారు.

టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే. కేశవరావు నేతృత్వంలో సహచర ఎంపీలతో కలిసి రవిచంద్ర పార్లమెంట్ భవన్ లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. తన జీవితంలో ఒకే రోజు రెండు అత్యున్నత చారిత్రక సంఘటనలు జరగడం అదృష్టంగా భావిస్తున్నానని ఎంపీ వద్దిరాజు పేర్కొన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్ కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# రాష్ట్రపతి ఎన్నికలో ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి పువ్వాడ




ఖమ్మం, జులై 18: (నేటినిజం ప్రతినిధి): రాష్ట్రపతి ఎన్నిక పోలింగ్ ను శాసనసభ కమిటీ హాలులో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సోమవారం పోలింగ్ బూత్ లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. విపక్షాల అభ్యర్థి యశ్వంత్ సిన్హాకు టీఆర్ఎస్ పార్టీ మద్దతు ఇస్తున్న సంగతి తెలిసిందే. ఈ నెల 21న ఎన్నిక ఫలితాలను ప్రకటిస్తారు.

# కామారెడ్డి జిల్లాలో ఘోర ప్రమాదం.. ఆటో, లారీ ఢీకొన్న ఘటనలో ఆరుగురు మృతి

నిజామాబాద్, జులై 18: కామారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. లారీ–ఆటో ఢీకొన్న ఘటనలో ఆరుగురు వ్యక్తులు అక్కడికక్కడే చనిపోయారు. ఈ ఘటన 161వ జాతీయ రహదారి మద్నూరు మండలం మెనూరు వద్ద సోమవారం జరిగింది. మద్నూరు నుంచి బిచ్కుంద వైపు జాతీయ రహదారిపై రాంగ్‌రూట్‌లో వెళ్లే ఆటో లారీని ఢీకొట్టింది. అదే సమయంలో హైదరాబాద్ నుంచి గుజరాత్ వైపు కంటైనర్ లారీ వెళ్తున్నది. రెండు వాహనాలు వేగంగా ఉండడంతో ఆటో నుజ్జునుజ్జు అయ్యింది.

ఈ యాక్సిడెంట్‌లో లారీ ముందుభాగంలోకి ఆటో చొచ్చుకువెళ్లింది. దీంతో ఆటోలో ఎందరున్నారు? ఎంతమంది చనిపోయారు? అనే వివరాలు పూర్తిగా తెలియడం లేదు. ఆరుగురి మృతదేహాలు మాత్రం బయటకు కనిపిస్తున్నాయని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం ఆటోను బయటకు తీసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఆటో రాంగ్‌రూట్‌లో వేగంగా రావడంతో పాటు అదే సమయంలో కంటైనర్ వేగంగా ఉండడంతో ప్రమాద తీవ్రత అధికంగా ఉందని పోలీసులు తెలిపారు.

అయితే, మృతులకు సంబంధించిన వివరాలు తెలియరాలేదు. ఆటో ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్తుందన్న విషయాలు తెలియాల్సి ఉన్నది. ప్రస్తుతం పోలీసులు మృతులకు సంబంధించిన ఫోన్ల ద్వారా.. అందులో డయల్ చేసిన నంబర్ల ద్వారా మృతులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉన్నది.

# విజ్ఞాన్ భవన్‌లో భారత సమాచార సర్వీసు అధికారుల మూడో వార్షిక మహాసభ ప్రారంభం

న్యూఢిల్లీ, జులై 18: కేంద్ర సమాచార–ప్రసారశాఖ మంత్రి శ్రీ అనురాగ్ సింగ్ ఠాకూర్ విజ్ఞాన్ భవన్‌లో భారత సమాచార సర్వీసు (ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్–ఐఐఎస్) అధికారుల మూడో వార్షిక మహాసభను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సమాచార–ప్రసారశాఖ కార్యదర్శి శ్రీ అపూర్వ చంద్ర, ప్రిన్సిపల్ డైరెక్టర్ జనరల్ శ్రీ జైదీప్ భట్నాగర్, శ్రీ సత్యేంద్ర ప్రకాష్, శ్రీ వేణుధర్ రెడ్డి, శ్రీ మయాంక్ కుమార్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు. రెండు రోజులపాటు సాగే ఈ సదస్సులో దేశవ్యాప్తంగాగల ఐఐఎస్ సీనియర్ అధికారులంతా పాల్గొంటున్నారు.

ఈ సందర్భంగా కేంద్రమంత్రి సమాచార–ప్రసారశాఖ మంత్రి శ్రీ అనురాగ్ సింగ్ ఠాకూర్ కీలకోపన్యాసం చేస్తూ– ప్రభుత్వ సమాచార ఆదానప్రదానంలోని ఐదు కీలకాంశాలను ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ మేరకు పౌర కేంద్రక–సహానుభూతి, లక్షిత ప్రేక్షక జనంతో సహసృష్టి, సహకారం, సాలోచన, నిరంతర సామర్థ్య వికాసం అత్యంత ఆవశ్యకాలని ఆయన నొక్కిచెప్పారు. దీన్ని మరింత విశదీకరిస్తూ– పౌరులను దృష్టిలో ఉంచుకుంటూ అన్నిరకాల సమాచారం ఔచిత్యంతో కూడినదై అర్థం చేసుకోదగినదిగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ అంగాలు, సంస్థలు, ప్రైవేటు రంగంసహా భాగస్వాములందరితోనూ చక్కని సహకారం అవశ్యమన్నారు. ప్రస్తుతం మనముందున్న బూటకపు వార్తలవంటి సవాళ్లతో సమాచార రంగం నిత్యం మారిపోతున్నదని ఆయన పేర్కొన్నారు. అందువల్ల ఇటీవలి కోవిడ్ మహమ్మారి పరిస్థితుల్లో గమనించిన దానికి తగినట్లు సమాచారాంశాలు వేగంతోకూడినవై, అనుసరణీయంగా ఉండాలని చెప్పారు. బూటకపు వార్తలను తిప్పికొట్టే సత్యనిర్ధారణ యూనిట్ల విస్తరణ, దివ్యాంగులకు సౌలభ్య కల్పన తదితరాల దిశగా ఐఐఎస్ అధికారులు చూపిన చొరవను, వారి పరివర్తనాత్మక కార్యక్రమాలను శ్రీ అనురాగ్ సింగ్ ఠాకూర్ కొనియాడారు. నవ్య మాధ్యమాల సాంకేతికతలు, సంస్థల నిర్మాణం, రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయాల ప్రాముఖ్యాన్ని ఎత్తిచూపుతూ సమాజంలోని చిట్టచివరి వ్యక్తికీ ప్రయోజనం చేకూర్చేలా ప్రభుత్వ సమాచార ప్రదాన సామర్థ్యాన్ని మరింత మెరుగుపరచడంపై ఆలోచనలు, కార్యక్రమాల గురించి తన మనోభావాలను వారితో పంచుకున్నారు. దేశంలోని 130 కోట్ల మంది ప్రజలకు సమాచార ప్రదాతలుగా తమ పాత్రకుగల ప్రాముఖ్యాన్ని గుర్తించాలని అధికారులందరినీ ఆయన కోరారు. ప్రజలకు మరింత చేరువ కావడంలో సమన్విత సమాచార ప్రదానం, కథన వివరణ నైపుణ్యాల ప్రాముఖ్యాన్ని కేంద్ర మంత్రి వివరించారు. అలాగే ప్రజాప్రతినిధులను మెరుగుపరచడానికి సమకాలీకరించబడిన కమ్యూనికేషన్ మరియు కథ చెప్పే కళ యొక్క ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు. సంస్థాగత నిర్మాణం, మార్గదర్శకత్వంతోపాటు అధికారులకు ఉత్తేజం కల్పించడం కూడా సమాన ప్రాముఖ్యంగల అంశమేనని స్పష్టం చేశారు.

సమాచార–ప్రసార మంత్రిత్వశాఖ కార్యదర్శి శ్రీ అపూర్వ చంద్ర మాట్లాడుతూ? కోవిడ్–19 మహమ్మారి సమయంలో సముచిత సమాచారం ప్రజలకు భరోసానిచ్చి, వారి మనస్సులోని భయాన్ని తొలగించడంలో విజయవంతమైందని పేర్కొన్నారు. ఈ మేరకు టీకాలు వేయడం, ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన వంటి సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించిందని చెప్పారు. అనేక ఇతర దేశాలతో పోల్చితే భారతదేశంలో టీకాలపై సందేహం దాదాపు శూన్యమన్నారు. అందుకే ఈ కార్యక్రమం 200 కోట్ల టీకా మోతాదుల మైలురాయిని చేరుకోగలదని ఆయన విశ్వాసం వెలిబుచ్చారు.

ప్రిన్సిపల్ డైరెక్టర్ జనరల్ శ్రీ జైదీప్ భట్నాగర్ ప్రసంగిస్తూ– సేవా ప్రదానంలో ప్రధానంగా సాధికారత, సౌలభ్య కల్పనపైనే దృష్టి కేంద్రీకృతమై ఉండాలన్నారు. అలాగే నిరంతర పౌర కేంద్రక కర్తవ్య నిమగ్నతలో ప్రవర్తనా మార్పు దిశగా సమాచార ప్రదానం, బూటకపు–తప్పుదోవ పట్టించే వార్తలను ఎదుర్కోవడం ప్రధానమని చెప్పారు. ఇటీవలి సంవత్సరాలలో సమాచార విస్ఫోటం నేపథ్యంలో ఈ పాత్ర గణనీయంగా వృద్ధి చెందడంతోపాటు విస్తరించిందని వ్యాఖ్యానించారు. ఇది కొత్త ప్రక్రియలు, ఉపకరణాల పునఃకల్పన, సార్వజనీనతలకు దోహదం చేసిందన్నారు.

సమాచార రంగం అంతర్లీనంగానే చైతన్యవంతమైనదనే వాస్తవాన్ని గుర్తిస్తూ సాగే ఈ రెండు రోజుల సదస్సులో నేటి కొత్త సవాళ్లు, భవిష్యత్తులో అత్యాధునిక కమ్యూనికేషన్ కోసం మార్గ ప్రణాళిక గురించి చర్చిస్తారు. ఈ మేరకు నిర్వహించే చర్చాగోష్ఠులలో 'కమ్యూనికేషన్ ఫర్ ఇండియా@2047', 'స్కిల్ అండ్ కెపాసిటీ బిల్డింగ్', 'జీ20పై దృష్టితో విదేశాల్లో భారతదేశాన్ని ముందుకు తేవడం', ప్రముఖ వక్తలు సూచించే 'ఎవాల్వింగ్ రోల్ ఆఫ్ గవర్నమెంట్ కమ్యూనికేషన్' తదితర అంశాలపైనా దృష్టి సారిస్తారు. ఈ మేరకు 'మైగవ్' సీఈవో శ్రీ అభిషేక్ సింగ్; కెపాసిటీ బిల్డింగ్ కమిషన్‌కు చెందిన డాక్టర్ ఆర్.బాలసుబ్రమణ్యం, శ్రీ హేమంగ్ జానీ; విదేశాంగ వ్యవహారాల శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీ అరిందమ్ బాగ్చీ; జి–20కి భారత షెర్పాగా వ్యవహరించే శ్రీ అమితాబ్ కాంత్ వంటి ప్రముఖులు ఇందులో ప్రసంగిస్తారు.

మహాసభల రెండోరోజున రైల్వే–కమ్యూనికేషన్లు, ఎలక్ట్రానిక్స్–ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖల మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ కీలకోపన్యాసం చేస్తారు. ఇక ముగింపు కార్యక్రమంలో కేంద్ర సమాచార–ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్.మురుగన్ ప్రసంగిస్తారు.

# ఈ ఏడాది నుంచి ప్రజలకు ఉచితంగా టెలి-లా సేవలు -శ్రీ కిరణ్ రిజిజు

న్యూఢిల్లీ, జులై 18: ఈ ఏడాది నుంచి ప్రజలకు ఉచితంగా టెలి–లా సేవలు లభిస్తాయని కేంద్ర న్యాయ శాఖ మంత్రి శ్రీ కిరణ్ రిజిజు ప్రకటించారు. జైపూర్ లో ఈ జరిగిన 18 వ అఖిల భారత న్యాయ సేవల సమావేశంలో మంత్రి ఈ ప్రకటన చేశారు. 1 లక్ష గ్రామ పంచాయితీల న్యాయ సహాయం కోరే అట్టడుగు వర్గాలకు చెందిన వారిని సాధారణ సేవా కేంద్రాలలో (అూఅలు) అందుబాటులో ఉన్న టెలి/ వీడియో–కాన్ఫరెన్సింగ్ వ్యవస్థల ద్వారా ప్యానెల్ న్యాయవాదులకు పరిచయం చేసి వారికి ఉచితంగా న్యాయ సహాయం అందేలా చూసేందుకు టెలి–లా ప్రధాన స్రవంతి గా పనిచేస్తుంది. సులభంగా వేగంగా ప్రతి ఒక్కరూ ఈ సౌకర్యాన్ని పొందేలా చూసేందుకు 2021లో టెలి–లా మొబైల్ అప్లికేషన్ (ఆండ్రాయిడ్ మరియు ఎనీూ రెండూ) కూడా 2021లో ప్రారంభించబడింది. ప్రస్తుతం టెలి–లా సౌకర్యం 22 షెడ్యూల్ భాషలలో అందుబాటులో ఉంది. ఈ డిజిటల్ విప్లవం నుంచి ప్రయోజనం పొందిన టెలి–లా కేవలం ఐదేళ్లలో 20 లక్షల మందికి పైగా లబ్ధిదారులకు న్యాయ సేవలు అందించింది.సమగ్ర న్యాయ సేవలు అందించాలనే లక్ష్యంతో రూపొందిన అవగాహన ఒప్పందంపై న్యాయ శాఖ, న్యాయ మరియు న్యాయ మంత్రిత్వ శాఖ మరియు నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా) సంతకాలు చేశాయి. అందరికీ న్యాయం అందించి, న్యాయ సూత్రాలను అందరికీ వర్తించేలా చూసి ప్రజల మధ్య ఏకీకరణ సాధించేందుకు న్యాయ శాఖ,నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా) కృషి చేస్తున్నాయని మంత్రి అన్నారు. ఈ లక్ష్య సాధనకు ఎంఓయూ దోహదంచేస్తుందని అని కేంద్ర మంత్రి అన్నారు. అవగాహన ఒప్పందం ప్రకారం టెలి–లా ప్రోగ్రామ్ కోసం ప్రత్యేకంగా ప్రతి జిల్లాలో 700 మంది న్యాయవాదుల సేవలను నల్సా అందిస్తుంది. ఈ ఎం ప్యానెల్ న్యాయవాదులు ఇప్పుడు రిఫరల్ న్యాయవాదులుగా కూడా వ్యవహరిస్తారు. వ్యాజ్యానికి ముందు దశలో వివాదాల పరిష్కారానికి కృషి చేసి కేసులు లేకుండా సమస్య పరిష్కారం అయ్యేలా వీరు కృషి చేస్తారు. వివాద పరిష్కారానికి సంబంధించిన యంత్రాంగాన్ని బలోపేతం చేయడంలో కూడా సహకారం అందిస్తారు. అతి తక్కువ కాలంలో కోటి మందికి ప్రయోజనం కలిగేలా నల్సా చర్యలు తీసుకుంటుందన్న విశ్వాసాన్ని శ్రీ కిరణ్ రిజిజు వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడిన శ్రీ కిరణ్ రిజిజు అండర్ ట్రయల్లను విడుదల చేయడం ద్వారా జైళ్ల రద్దీని తగ్గించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. నల్సా దాని రాష్ట్ర, జిల్లా స్థాయి న్యాయ సహాయ సంస్థల ద్వారా ఈ దిశలో కృషి చేయాలని మంత్రి సూచించారు. ఇప్పటికే రాష్ట్ర, జిల్లా స్థాయి న్యాయ సహాయ సంస్థలు అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ ఏర్పాటు చేసి అండర్ ట్రయల్లకు ఉచిత న్యాయ సహాయం/న్యాయ సలహాలు అందించేందుకు పని చేస్తోంది. గత సంవత్సరంలో 21,148 అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ సమావేశాలు నిర్వహించబడ్డాయి. ఫలితంగా 31,605 మంది అండర్ ట్రయల్ ఖైదీలు విడుదలయ్యారు.

అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ సమన్వయంతో గరిష్ట సంఖ్యలో విచారణలో ఉన్న ఖైదీలను విడుదల చేసేందుకు వీలుగా అండర్ ట్రయల్ ఖైదీలకు న్యాయ సలహా/ సహాయం అందించేందుకు రాష్ట్ర న్యాయ సేవల అధికారులు తమ ప్రయత్నాలను మరింత ముమ్మరం చేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఈ కాలంలో సంబంధిత జిల్లా జడ్జి నేతృత్వంలో అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ రెగ్యులర్ సమావేశాలు జరిగేలా చూడాలని ఆయన హైకోర్టులకు విజ్ఞప్తి చేశారు, జైళ్లలో మగ్గుతున్న గరిష్ట సంఖ్యలో అండర్ ట్రయల్ ఖైదీలను 2022 ఆగస్టు 15లోపు విడుదల అయ్యేలా సిఫార్సు చేయాలని ఆయన కోర్టులను కోరారు. అండర్ ట్రయల్ ఖైదీలను విడుదల చేయవచ్చని ఆయన అన్నారు. "ఆజాదీ కా అమృత్ మహోత్సవ్" వేడుకలో భాగంగా భారత ప్రభుత్వం ఖైదీలకు ప్రత్యేక ఉపశమనం ఇవ్వాలని ఇప్పటికే నిర్ణయించిందని తెలిపిన మంత్రి దీని కోసం హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఇప్పటికే మార్గదర్శకాలను జారీ చేసిందని వెల్లడించారు.

భారత రాజ్యాంగం ప్రకారం నిర్దేశించిన చట్టపరమైన వ్యవస్థలో న్యాయం పొందడం ఒక హక్కు గా గుర్తించబడిందని శ్రీ కిరణ్ రిజిజు తెలిపారు. హక్కును సాధించడానికి ఇప్పటి వరకు సాధించిన విజయాలను ప్రాతిపదికగా చేసుకుని నూతన వ్యవస్థను రూపొందించడానికి న్యాయ సేవ అధికారులు మరియు ప్రభుత్వంలోని వివిధ విభాగాలు , సంస్థలు మధ్య సమన్వయంతో పనిచేయాలని మంత్రి అన్నారు.

# సీఎం సహాయ నిధి నుండి చెక్ పంపిణి



మహబూబాబాద్, జులై 18 (నేటినిజం ప్రతినిధి): మహబూబాబాద్ జిల్లా పెద్ద వంగర మండల కేంద్రంలో ఎస్సీ కాలనీకి చెందిన చెరుకు పూలమ్మ భర్త సోమయ్య తన ఆరోగ్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 30500 చెక్కును పెద్ద వంగర గ్రామ సర్పంచ్ లక్ష్మీరామచంద్రయ్య శర్మ చేతుల మీదుగా అదేవిధంగా వడ్డేకొత్తపల్లి గ్రామంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముత్తినేని శ్రీనివాస్ చేతుల మీదుగా బోల్లు ఉప్పలయ్య కు సీఎం రిలీఫ్ ఫండ్ 60,000 రూపాయలు చెక్ అంద చేయడం జరిగింది.

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎర్రబెల్లి దయాకర్ రావు రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మరియు ఆర్ డబ్ల్యు ఎస్ శాఖ మంత్రి సహకారంతో అన్ని విధాలుగా ఆదుకుంటున్నందున ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు బోనగిరి లింగమూర్తి మరియు మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు చిలుక బిక్షపతి ,ఉప సర్పంచ్ శ్రీరాం రాము, వార్డు సభ్యులు చెరుకు యాకయ్య ,ఎడవల్లి సతీష్ రెడ్డి ,విద్యా కమిటీ చైర్మన్ సుంకరి అంజయ్య ,టీఆర్ఎస్ నాయకులు చిలుక పస్తాల వెంకటయ్య చెరుకు వెంకన్న బంగారు వెంకన్న దంతాలపల్లి ప్రశాంత్ ఓరుగంటి మహేష్ , వడ్డేకొత్తపల్లి గ్రామంలో రైతు కో ఆర్డనేటర్ తంగెలపల్లి మల్లికార్జున చారి ,తెరాస గ్రామ పార్టీ అధ్యక్షుడు కేశబోయిన కుమారస్వామి ,ఉప్ప సర్పంచ్ మొర్రిగడుదుల శ్రీనివాస్ ,బోల్లు ఉషయ్య ,కేశబోయిన సంధ్య యాకన్న ,కేశబోయిన సుభాస్ పాల్గొన్నారు.

# 23నుంచి ఫ్లిఫ్‌కార్ట్ బిగ్ సేవింగ్స్ డే సేల్ : స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, టీవీలపై డిస్కౌంట్స్..

హైదరాబాద్, జులై 18:ఈ కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ ఈనెల 23న బిగ్ సేవింగ్స్ డే సేల్‌ను నిర్వహించనుంది. ఈ సేల్‌లో భాగంగా కస్టమర్లకు స్మార్ట్‌ఫోన్లు, హెడ్‌సెట్స్, ల్యాప్‌టాప్‌లు సహా పలు ఎలక్ట్రానిక్స్‌పై ఆకర్షణీయ డీల్స్, డిస్కౌంట్లు అందుబాటులో ఉంటాయి. జులై 27 వరకూ ఫ్లిప్‌కార్ట్ సేల్ ఆఫర్లు లైవ్‌లో ఉండనుంది. ఒప్పో రెనో 5 ప్రొ, ఐఫోన్ 11, మోటో జీ31పై పలు ఆఫర్ల గురంచి ఫ్లిప్‌కార్ట్ ఇప్పటికే టీజర్లలో వెల్లడించింది. సేల్ డేట్ దగ్గరపడే కొద్దీ మరిన్ని ఆఫర్లను ప్రకటించే అవకాశం ఉంది.

ఎలక్ట్రానిక్స్‌పై ఫ్లిప్‌కార్ట్ సేల్‌లో 80 శాతం వరకూ డిస్కౌంట్లు ఉన్నాయి. బ్యాంక్ కార్డ్‌లు మరియు ఇఎంఐ లావాదేవీలపై కూడా డిస్కౌంట్‌లు ఉండవచ్చు. ఇక హెడ్‌ఫోన్లు, స్పీకర్లపై 70 శాతం వరకూ డిస్కౌంట్ లభించనుండగా రూ.99 నుంచి రూటర్స్, కీబోర్డులు వంటి కంప్యూటర్ యాక్సెసరీస్ లభిస్తాయి. ఇక ట్యాబ్లెట్స్‌పై సేల్‌లో 45 శాతం వరకూ డిస్కౌంట్ ఆఫర్ చేస్తున్నారు. ఫ్లిప్‌కార్ట్ కూడా 12జూఎ మరియు 10జూఎ మధ్య తక్కువ ధరలో ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని తెలిపింది.

సేల్‌లో టీవీలు, అప్లయన్సెస్‌పై ఏకంగా 70 శాతం ఆఫర్ అందుబాటులో ఉంటుందని ఈ కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ పేర్కొంది. బ్యాంక్ ఆఫర్లతో కస్టమర్లు అదనంగా డిస్కౌంట్లు పొందే వెసులుబాటు ఉంది. కొన్ని ఉత్పత్తులపై నోకాస్ట్ ఈఎంఐ ఆప్షన్ అందుబాటులో ఉంది. ఇక మరో ఈ కామర్స్ దిగ్గజం అమెజాన్ సైతం జులై 23న ప్రైం డే సేల్‌ను నిర్వహిస్తోంది. జులై 24న అమెజాన్ సేల్ ముగియనుండగా కొన్ని ఆఫర్లను జులై 27 వరకూ కంపెనీ పొడిగించే అవకాశం ఉంది.

# గృహకార్మిక చట్టాలు అమలులో ఉన్నాయా? పార్లమెంట్లో ప్రశ్నించిన తిరుపతి ఎంపీ



తిరుపతి సి, జులై 18: దేశంలోని మొత్తం గృహ కార్మికుల సంఖ్యపై ఏదైనా డేటా ఉందా? అలా అయితే, ఇప్పటివరకు ఇ–శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న గృహ కార్మికుల సంఖ్య ఎంత? అని తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి సోమవారం పార్లమెంట్ లో ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొవిడ్ 19 మహమ్మారి నేపథ్యంలో గృహ కార్మికుల సమస్యలను తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం ఏదైనా నిర్దిష్ట పథకం లేదా కార్యక్రమాన్ని ప్రారంభించిందా అని ప్రశ్నించారు. గృహ కార్మికుల కోసం ముసాయిదా జాతీయ విధానం పరిశీలనలో ఉందనేది నిజమేనా? అలా అయితే.. పాలసీ అమలు, ప్రస్తుత స్థితి.. దాని వివరాలు, తెలియజేయాలని గురుమూర్తి అడిగారు.

ఈ ప్రశ్నకు సమాధానంగా కేంద్ర కార్మిక, ఉపాధి శాఖామంత్రి భూపేందర్ యాదవ్ బదులిస్తూ.. గృహ కార్మికుల కోసం ఎలాంటి జాతీయ ముసాయిదా విధానం లేదన్నారు. ఈ -శ్రమ్ పోర్టల్‌లో 2.76 కోట్ల మంది గృహ కార్మికులు జులై 12, 2022 నాటికి, నమోదు చేసుకున్నారని చెప్పారు. అసంఘటిత కార్మికుల సామాజిక భద్రతా చట్టం ప్రకారం.. గృహ కార్మికులతో సహా అసంఘటిత కార్మికులందరికీ సామాజిక భద్రతను అందిస్తుందని చెప్పారు. అసంఘటిత కార్మికులకు పెన్షన్ కోసం ప్రభుత్వం ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, వికలాంగుల రక్షణ కోసం.. ప్రధాన మంత్రి శ్రమ యోగి మన్ ధన్ పెన్షన్ యోజన వంటి కేంద్ర రంగ పథకాలను ప్రారంభించిందన్నారు.

# పెండింగ్ ఆస్తిపన్ను రాబట్టేందుకు వన్ టైమ్ స్కీం.. జీహెచ్‌ఎంసీలో 1626కోట్ల బకాయిలు

హైదరాబాద్, జులై 18:: పేరుకు పోయిన ఆస్తిపన్ను బకాయిలను త్వరితగతిన రాబట్టేందుకు సర్కార్ వన్‌టైమ్ స్కీమ్(ఓటీఎస్) పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఈ మేరకు జీవో నెంబర్ 485 జారీ చేశారు. 2021–22 సంవత్సరానికి కలిపి పేరుకు పోయిన బకాయిలను అక్టోబర్ 31లోపు ఒకేసారి చెల్లిస్తే 90శాతం ఆస్తిపన్నుపై వడ్డీని మాఫీ చేయనున్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో 2021–22 సంవత్సరానికి రూ.1626 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి.

విస్తృతంగా ప్రచారం కల్పించడంతో పాటు, బకాయిలను చెల్లించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆయన జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు. గతంలో ఎర్లీబర్డ్ పేరిట తీసుకొచ్చిన పథకానికి విశేష స్పందన వచ్చిన నేపథ్యంలో ఈ వన్ టైమ్ స్కీమ్ ద్వారా పేరుకుపోయిన ఆస్తి పన్ను బకాయిలను రాబట్టేం దుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇందుకు సంబంధించి బల్దియా కమిషనర్ త్వరలో అధికారులతో సమావేశం నిర్వహించి మార్గ నిర్దేశం చేయనున్నట్లు జీహెచ్‌ఎంసీ వర్గాలు తెలిపాయి.

# భారీగా గుట్కా ప్యాకెట్ల పట్టివేత.. తనిఖీలో గుట్టు రట్టు..



రంగారెడ్డి, జులై 18: కర్ణాటక రాష్ట్రం నుంచి సరిహద్దు ద్వారా వికారాబాద్ జిల్లా తాండూరు ప్రాంతానికి తరలిస్తున్న గుట్కా ప్యాకెట్లను పోలీసులు భారీ ఎత్తున స్వాధీనం చేసుకున్నారు. దాదాపు రూ.60 వేల విలువైన నిషేధిత ప్యాకెట్లను పట్టుకుని వ్యాపారిపై కేసు నమోదు చేశారు. సోమవారం తాండూరు డీఎస్పీ జీ.శేఖర్ గౌడ్ కేసు వివరాలను వెల్లడించారు. వికారాబాద్ ప్రాంతానికి చెందిన ఉప్పరి బాలరాజు ఆదివారం సాయంత్రం కర్ణాటక రాష్ట్రం చించోల్లిలో నిషేధిత గుట్కా ప్యాకెట్లను ఆర్టీసీ బస్సులో తెలంగాణ ప్రాంతానికి తీసుకవస్తున్నాడు. జిల్లా ఎస్పీ సంద్యాల కోటిరెడ్డి ఆదేశాల మేరకు తాండూరు డీఎస్పీ శేఖర్ గౌడ్ పర్యవేక్షణలో తాండూరు మండలంలోని కొత్లాపూర్ సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో నిరంతర తనిఖీలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో కూడ ఆదివారం సాయంత్రం విధుల్లో ఉన్న పోలీస్ కానిస్టేబుళ్లు అశోక్ కుమార్, ప్రవీణ్ లు తనిఖీలు చేయగా ఉప్పరి బాలరాజుకు చెందిన నిషేధిత గుట్కా ప్యాకెట్లను గుర్తించారు. ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కరణ్ కోట్ ఎస్ఐ మధుసూధన్ రెడ్డికి సమాచారం అందించారు.

ఉప్పరి బాలరాజును అదుపులోకి తీసుకుని విచారించగా కర్ణాటక రాష్ట్రం చించొల్లి నుంచి తరలించినట్లు తెలిపాడు. సోమవారం తాండూరు డీఎస్పీ జీ.శేఖర్ గౌడ్ మీడియాతో సమావేశమై కేసు వివరాలను వెల్లడించారు. ఉప్పరి బాలరాజు నుంచి స్వాధీనం చేసుకున్న గుట్కా ప్యాకెట్ల విలువ రూ.60వేలు ఉంటుందన్నారు. భారీ మొత్తంలో గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఉప్పరి బాలరాజు గుట్కా ప్యాకెట్లను కర్ణాటక నుంచి తీసుకవచ్చి వికారాబాద్ ప్రాంతంలోని పాన్ డబ్బాలు, కిరాణా షాపులకు సరఫరా చేసేవాడని వివరించారు. ' ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. అదేవిధంగా తాండూరు ప్రాంతంలో నిషేధిత గుట్కా ప్యాకెట్ల రవాణా నియంత్రణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎవరైనా అక్రమ వ్యాపారానికి పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కరణ్ కోట్ ఎస్ఐ మధుసూధన్ రెడ్డి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

# తిరుమలలో భక్తుల రద్దీ.. శ్రీవారి దర్శనానికి 9 గంటల సమయం

తిరుపతి సి, జులై 18:కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీవెంకటేశ్వర స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. వారం రోజులుగా తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. శ్రీవారిని సర్వదర్శనం కోసం 31 కంపార్టుమెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. వీరికి దర్శనానికి 9 గంటల సమయం పడుతుందని సంబంధిత అధికారులు తెలిపారు. నిన్న శ్రీవారిని 73,387 మంది భక్తులు దర్శించుకోగా 33,965 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 4.68 కోట్లు వచ్చిందని వివరించారు.

# హైవేపై ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కంటైనర్.. అక్కడికక్కడే ఇద్దరు మృతి..







నిజామాబాద్, జులై 18: నిజామాబాద్ జిల్లాలో ఇవ్వాల ఘోర ప్రమాదం జరిగింది. బాల్కొండ దగ్గర జాతీయ రహదారి 44పై సోమవారం ఆగి ఉన్న లారీని కంటైనర్ ఢీకొట్టింది. ఈ యాక్సిడెంట్‌లో లారీ డ్రైవర్ రాబిన్ ఖాన్ (25), కంటైనర్ డ్రైవర్ రాస్మోద్దీన్ ఖాన్ (20) అక్కడికక్కడే చనిపోయారు. కంటైనర్ క్లీనర్ ఖుర్షీద్ కు తీవ్ర గాయాలయ్యాయి. కాగా, అతడిని నిర్మల్లోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆర్మూర్ రూరల్ సిఐ గోవర్ధన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుండి ఆదిలాబాద్ రూట్‌లో కొబ్బరికాయల లోడుతో వెళ్తున్న హర్యానాకు చెందిన లారీ ఒకటి.. జాతీయ రహదారి 44 పై బాల్కొండ సమీపంలో టైర్ పంక్చర్ అయ్యింది. దీంతో జాతీయ రహదారి నడిరోడ్డుపై లారీ నిలిపి ఎలాంటి ఇండికేషన్స్ లేకుండానే డ్రైవర్ టైరు మారుస్తున్నాడు. ఈ క్రమంలో లారీ వెనుక నుంచి వచ్చిన నాగాలాండ్ కు చెందిన కంటైనర్ ఆ లారీని ఢీకొట్టింది. దీంతో డ్రైవర్ రాబిన్ ఖాన్ అక్కడికక్కడే చనిపోయాడు.

కంటైనర్ డ్రైవర్ రాస్మోద్దీన్ ఖాన్ కు తీవ్ర గాయలై లారీలోనే ప్రాణాలు కోల్పోయాడు. కంటైనర్ క్లీనర్ ఖుర్షీద్ కు తీవ్రగాయాలు కాగా అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. నేషనల్ హైవే అంబులెన్స్ లో క్షతగాత్రుడిని నిర్మల్ లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అటువైపు వెళ్తున్నా మరో లారీ డ్రైవర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఆర్మూర్ రూరల్ సిఐ గోవర్ధన్ రెడ్డి, బాల్కొండ ఎస్సై గోపితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. యాక్సిడెంట్‌కు గురైన రెండు లారీలను జెసిబి సాయంతో పక్కకు తొలగించి, ట్రాఫిక్ క్లియర్ చేశారు. రోడ్డుపై వాహనాలు నిలిచిపోవడంతో బాల్కొండ పాత జాతీయ రహదారి మీదుగా దారి మళ్లించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్ఉట సీఐ తెలిపారు.

# క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట

హైదరాబాద్, జులై 18:క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, క్రీడాకారులకు కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సూచించారు. మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకల సందర్భంగా నిర్వహించనున్న జూబ్లీహిల్స్ నాకౌట్ క్రికెట్ టోర్నీ కోసం రహ్మత్‌నగర్ డివిజన్‌లో భారీ క్రీడా మైదానం సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఆదివారం హెచ్ఎఫ్‌నగర్ క్వారీ ల్యాండ్‌లో సుమారు 5 ఎకరాల స్థలంలో రూ. కోటి 95 లక్షలతో ఏర్పాటు చేస్తున్న ప్లే గ్రౌండ్ పనులను కార్పొరేటర్ సీఎన్ రెడ్డితో కలిసి ప్రారంభించారు.

ఇప్పటికే 136 జట్లు పాల్గొన్న డివిజన్ వారీ లీగ్ పోటీల తుది పోరుకోసం 7 డివిజన్‌లలో గెలిచిన విన్నర్స్, రన్నర్స్ జట్లకు ఈనెల 20 నుంచి నాలుగు రోజులపాటు నిర్వహించే ఫైనల్స్ పోటీలకు ఈ భారీ క్రీడా మైదానం అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో విజేతకు రూ.2 లక్షలు, రన్నర్స్‌కు రూ. లక్ష, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు రూ.50 వేల చొప్పున బహుమతులివ్వనున్నట్లు తెలిపారు. అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేయనున్న ఈ క్రీడా మైదానం రహ్మత్‌నగర్, బోరబండ చుట్టూపక్కల ప్రాంతాల క్రీడాకారులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు మన్సూర్, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## భద్రకాళి, మల్లన్నలను దర్శించుకున్న ఎంపీ సంతోష్



వరంగల్,జూలై 18: వరంగల్ నగరంలోని భద్రకాళి అమ్మవారు, ఐనవోలు మల్లన్నను రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్ కుమార్ ఆదివారం దర్శించుకున్నారు. చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్‌తో పాటు ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే అరూరి రమేశ్‌తో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఐనవోలులో వారికి డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, ఆలయ ఈవో అద్దంకి నాగేశ్వర్ రావు, అర్చకులు ఘన స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా ఆల య ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భం గా వారు మాట్లాడారు. వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూసుకోవాలని, ఏర్పాట్లుకు సంబంధించి అధికారులకు దిశా నిర్దేశం చేయడానికి స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ గోదావరి పరీవాహక ప్రాంతాలకు వెళ్లారన్నారు. ఈ వర్షాల వల్ల రాష్ట్ర, దేశ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగొద్దని మల్లికార్జునస్వామిని వేడుకున్నట్లు తెలిపారు. రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా తీర్చిదిద్దడం కోసం ముందుకు సాగుతున్న సీఎం కేసీఆర్‌కు స్వామి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నామన్నారు. ఆలయ అభివృద్ధికి ఒక భక్తుడిగా తన వంతు సహకారం ఉంటుందని రాజ్యసభ సభ్యుడు సంతోష్ కుమార్ తెలిపారు.

# హైదరాబాద్‌లో పలు చోట్ల వర్షం

హైదరాబాద్, జులై 18: నగరంలో పలుచోట్ల వర్షం కురుస్తున్నది. సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, తిరుమలగిరి, అల్వార్, బొల్లారం, జేబీఎస్, మారేడ్‌పల్లి, పాట్నీ సెంటర్‌లో వానపడుతున్నది. అలాగే చిలుకలగూడ, గుండపోచంపల్లి, కొంపల్లి, కూకట్‌పల్లి, ప్రగతినగర్, నిజాంపేటతో పాటు పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తున్నది. వర్షంతో వాహనదారులు ఇబ్బందులుపడ్డారు. ఇదిలా ఉండగా.. రాష్ట్రంలో రాగల మూడు రోజుల్లో వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

ఒడిశా తీరం, పరిసర ప్రాంతాల్లో ఉన్న అల్పపీడనం ఇవాళ వాయువ్య బంగాళాఖాతంలోని ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరంలోనూ కొనసాగుతున్నది. దీనికి అనుబంధంగా సముద్రమట్టానికి 7.6కిలోమీటర్ల ఎత్తులో ఆవర్తనం ఆవరించి ఉ న్నది. వీటి ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఆదివారం పలు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది.

# కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అధ్యక్షతన ఆరు సైన్స్ మంత్రిత్వ శాఖలు, విభాగాల 5వ సంయుక్త సమావేశం



న్యూఢిల్లీ, జులై 18: అగాదాలను ఛేదించడానికి , సమన్వయ సమీకృత విధానాన్ని అభివృద్ధి చేయడానికి వివిధ శాస్త్రీయ సంస్థల ఉమ్మడి సమావేశాలను నిర్వహించడం ద్వారా ప్రారంభించిన ధోరణిని కొనసాగిస్తూ, కేంద్ర సైన్స్ టెక్నాలజీ, ఎర్త్ సైన్సెస్ శాఖల సహాయ మంత్రి (స్వతంత్ర హోదా ) , పీఎంవో, సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్లు, అణుశక్తి, అంతరిక్ష శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్

ఈరోజు సైన్స్ అండ్ టెక్నాలజీ, బయోటెక్నాలజీ, సి ఎస్ ఐ ఆర్, ఎర్త్ సైన్సెస్, స్పేస్ , అటామిక్ ఎనర్జీతో సహా ఆరు సైన్స్ మంత్రిత్వ శాఖలు, విభాగాల 5వ సంయుక్త సమావేశానికి అధ్యక్షత వహించారు. ఇంటిగ్రేటెడ్ స్టార్టప్‌లు, ఇంటిగ్రేటెడ్ ఆర్ అండ్ డి అవసరాన్ని మంత్రి నొక్కిచెప్పారు.

రెండు గంటలకు పైగా సాగిన ఈ సమావేశంలో, శాస్త్ర/ సాంకేతిక జోక్యానికి అవసరమైన 214 రంగాలను అంతరిక్షం, అణుశక్తితో సహా మొత్తం ఆరు సైన్స్ డిపార్ట్ మెంట్ లు సైంటిఫిక్ అప్లికేషన్ లు, టెక్నలాజికల్ సొల్యూషన్స్ కోసం 40 లైన్ మినిస్ట్రీల నుంచి మ్యాప్ చేసినట్లు మంత్రి తెలియజేశారు.

శాస్త్రీయ అనువర్తనాలు, పరిష్కారాల కోసం లైన్ మినిస్ట్రీల నుండి పెరుగుతున్న అభ్యర్థనలు సాధారణ మంత్రిత్వ శాఖలు విభాగాల సాంకేతిక , సంక్లిష్ట సమస్యలను పరిష్కరించడానికి సైన్స్ మంత్రిత్వ శాఖలు విభాగాలను భాగస్వాములను చేయాలనే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దార్శనికతను చాటుతున్నాయని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు.లైన్ మినిస్ట్రీస్ కు శాస్త్రీయ పరిష్కారాలు , ఇన్ పుట్ లను అందిస్తూనే, బడ్జెట్ షేరింగ్ యొక్క ఒక సంపూర్ణ ఫ్రేమ్ వర్క్ ను రూపొందించాలని ఆయన పిలుపునిచ్చారు.

2015 లో, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జోక్యంతో, వివిధ మంత్రిత్వ శాఖలు , విభాగాల ప్రతినిధులు, ఇస్రో , అంతరిక్ష విభాగానికి చెందిన శాస్త్రవేత్తలతో విస్తృతమైన సంభాషణలో పాల్గొన్నామని, మౌలిక స దుపాయాల అభివృద్ధితో పాటు వివిధ సంక్షేమ పథకాలను అమలు చేయడం వంటి వాటిని మెరుగుపరచడం, వేగవంతం చేసే విధానాలు రూపొందించడానికి అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆధునిక సాధనంగా ఎలా ఉ పయోగించవచ్చో తెలుసుకోవడానికి

ఢిల్లీలో విస్తృతమైన మేధోమథనం జరిగిందని డాక్టర్ జితేంద్ర సింగ్ గుర్తు చేసుకున్నారు.

32 మంత్రిత్వ శాఖలు, విభాగాలను 'సమస్యా ప్రకటనల' కోసం సంప్రదించినట్లు మంత్రి తెలియజేశారు. సిఎస్ ఐఆర్ 20 ఛాలెంజ్ ప్రాంతాలకు నాయకత్వం వహిస్తుంది మొత్తం ఎక్సర్ సైజ్ సి ఎస్ ఐ ఆర్ ద్వారా సమన్వయం చేయబడుతున ్ందున లైన్ మినిస్ట్రీస్ ద్వారా ఎదురయ్యే 46 ఛాలెంజ్ ప్రాంతాల్లో పాల్గొంటుంది.

వ్యవసాయం, ఆహారం, విద్య, నైపుణ్యం, రైల్వేలు, రోడ్లు, జల్ శక్తి, విద్యుత్ మరియు బొగ్గు వంటి రంగాలకు వివిధ శాస్త్రీయ అనువర్తనాలను కూడా ఆయన ప్రస్తావించారు. ఇతర సైన్స్ డిపార్ట్ మెంట్ లతో పాటు , డిబిటి , ఇస్రో కూడా కొన్ని సవాళ్ల పరిష్కారాల అభివృద్ధి/విస్తరణలో నాయకత్వం వహించడానికి తమ ప్రాధాన్యతను సమర్పించాయి.

కేంద్ర మంత్రిత్వ శాఖలు/ విభాగాల తరహాలో 36 రాష్ట్రాలు/ కేంద్ర పాలిత ప్రాంతాలు 172 ప్రధాన సమస్యలను గుర్తించాయని, 24 కేంద్ర మంత్రిత్వ శాఖలు/ విభాగాల నుండి పరిష్కారాలను కోరుతూ రాష్ట్రాలు 163 సాంకేతిక సమస్యలను లేవనెత్తాయని డాక్టర్ జితేంద్ర సింగ్ చెప్పారు.మొత్తం 28 రాష్ట్రాలు, ఎనిమిది కేంద్ర పాలిత ప్రాంతాలకు సంబంధించిన ఎస్ టి ఐ (సైన్స్ టెక్నాల జీ అండ్ ఇన్నోవేషన్ మ్యాపింగ్ ఎక్సర్ సైజ్ ఆరు నెలల కాలంలో పూర్తి కావడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఇన్నోవేషన్ ర్యాంకింగ్, స్టార్టప్ ర్యాంకింగ్, ఎస్ అండ్ టీ ఆర్గనైజేషన్స్ సంఖ్య, ఆర్ అండ్ డి ల్యాబ్స్, యూనివర్సిటీలు, ఇంక్యుబేటర్లు, స్టార్టప్ లు, ఎంఎస్ ఎమ్ ఈలు, పరిశ్రమలు, క్లస్టర్ లు, గ్రాస్ రూట్ ఇన్నోవేషన్స్ మొదలైన వాటి పరంగా ఎన్ ఈతో సహా రాష్ట్రాల మ్యాపింగ్ జరిగిందని ఆయన తెలిపారు.

ఈ ఏడాది జరగనున్న రాష్ట్ర ఎస్ అండ్ టి మంత్రుల సదస్సుకు సంబంధించిన ఎజెండా, ఇతివృత్తాలను ముందుగానే సిద్ధం చేయాలని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్ని సైన్స్ మంత్రిత్వ శాఖలు, విభాగాలను కోరారు. రాష్ట్రాలు, పారిశ్రామిక ప్రతినిధులు ,

ఇతర భాగస్వాములతో జరిగే మొట్ట మొదటి జాతీయ సైన్స్ కాన్ క్లేవ్ లో రాష్ట్రాల ప్రత్యేక చర్చ లను చేర్చవచ్చని ఆయన చెప్పారు.

ప్రతిపాదిత సైన్స్ అండ్ టెక్నాలజీ కమ్యూనికేషన్ సెంటర్ (ఎస్ టి సి సి) అమల్లోకి రావడానికి ముందు, భారతదేశ శాస్త్రీయ ప్రగతి గురించి సాధారణ అవగాహన కల్పించడానికి అన్ని శాఖల విజయ గాథలను క్రోడీకరించి, సామాన్య ప్రజలకు అందించాలని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. విజయగాథలపై వర్క్ షాప్ లను క్రమం తప్పకుండా నిర్వహించాలని కూడా ఆయన ఆదేశించారు.

ఈ సమావేశంలో భారత ప్రభుత్వ ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వైజర్, డి ఎస్ టి సెక్రటరీ, స్పేస్ డిపార్ట్మెంట్ సెక్రటరీ, ఎర్త్ సైన్సెస్ సెక్రటరీ, మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ సెక్రటరీ, బయోటెక్నాలజీ డిపార్ట్ మెంట్ సెక్రటరీ, డిఎఇ సెక్రటరీ, కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ సెక్రటరీ, ఇతర సైన్స్ డిపార్ట్ మెంట్ ల ప్రతినిధులు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి నేతృత్వంలో జరిగిన సమిష్టి కృషి కారణంగా లక్షలాది మంది రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసింది: శ్రీ తోమర్

న్యూఢిల్లీ, జులై 18: దేశంలో వ్యవసాయ రంగం తో పాటు రైతులు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నారని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శ్రీ నరేంద్ర సింగ్ తోమర్ అన్నారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు, భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్), కృషి విజ్ఞాన కేంద్రాలు (కె.వి.కె.లు) లతో సహ అందరి సమగ్ర ప్రయత్నాల కారణంగా అనేక మంది రైతులు తమ ఆదాయాలను రెట్టింపు చేయడంలో లేదా అంతకన్నా ఎక్కువ చేయడంలో విజయం సాధించారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ను పురస్కరించుకొని, ఆదాయం పెరిగిన లక్షలాది మంది రైతులలో 75,000 మంది రైతుల విజయగాథలను సంకలనం చేయడం ద్వారా ఒక ఈ-ప్రచురణను రూపొందించారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడంపై రాష్ట్రాల వారీగా సంక్షిప్త ప్రచురణ కూడా తయారు చేయబడింది. ఈ సందర్భంగా వీటిని వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తోమర్ విడుదల చేశారు. ఈ-ప్రచురణ ఐసీఏఆర్ వెబ్ సైట్ లో అందుబాటులో ఉంది. ఐసిఎఆర్ 94వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శ్రీ తోమర్ శాస్త్రవేత్తలు మరియు రైతులకు అవార్డులను కూడా పంపిణీ చేశారు.

ఢిల్లీలోని ఐసిఎఆర్ పూసా క్యాంపస్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీ తోమర్ ప్రసంగిస్తూ, ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ సంవత్సరంలో, ఆదాయాలు రెట్టింపు లేదా రెట్టింపు కంటే ఎక్కువ అయినటువంటి 75,000 మంది రైతుల విజయ గాథలను నమోదు చేయాలని ఐసిఎఆర్ గత సంవత్సరం నిర్ణయిం చినందున ఈ రోజు ఒక చారిత్రాత్మకమైన రోజు అని ఆయన అన్నారు. విజయవ ంతమైన రైతుల ఈ సంకలనం దేశ చరిత్ర లో ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆయన అన్నారు. శ్రీ తోమర్ ఐసిఎఆర్ ఇతర ప్రచురణలను కూడా విడుదల చేశారు. ఐసిఎఆర్ వ్యవస్థాపక దినోత్సవాన్ని 'సంకల్ప్ దివస్'గా జరుపుకోవాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా సంవత్స రం మొత్తానికి సంబంధించిన తీర్మానాలు చేపట్టాల ని, వాటిని వచ్చే వ్యవస్థాపక దినోత్సవం నాటికి పూర్తి చేయాలన్నారు.

భారతదేశం ఒక వ్యవసాయ దేశమని, వ్యవసాయ రంగం ఒక రంగమని, ఇందులో నిర్విరామంగా పనిచేయాలని, కొత్త సవాళ్లను పరిష్కరించాల్సిన అవసరం ఉందని శ్రీ తోమర్ అన్నారు. ప్రస్తుతం, సంప్రదాయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడంతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ముందుకు సాగడం సవాలు. గ్రామీణ ప్రాంతాలు, పేదలు, రైతుల జీవితాల్లో మార్పు తీసుకురావాలని, తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడాలని, జీవితం సులభంగా ఉ ండాలని, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలని ప్రధాన మంత్రి చేసిన ప్రయత్నమిది. ఈ లక్ష్యసాధన దిశగా బహుముఖ ప్రయత్నాలు చేశారు. కొత్త ఉ ద్యోగాలను సృష్టించడానికి పథకాలను అమలు చేయడం ద్వారా నిధులు సమకూరుస్తున్నారు. ప్రజలను ఉపాధితో అనుసంధానం చేస్తున్నారు, వ్యవసాయ రంగంలో ఉపాధి అవకాశాలు సృష్టించబడుతున్నాయని ఆయన అన్నారు.

"ఒక విద్యావంతుడు వ్యవసాయాన్ని ఒక వృత్తిగా ఎంచుకున్నప్పుడు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అర్హత మరియు అనుభవంతో కలపడం ద్వారా, అనేక ఉపాధి అవకాశాలను సృష్టించవచ్చు, తద్వారా ఉ పాధి సమస్యను పరిష్కరించవచ్చు" అని ఆయన అన్నారు.

కేంద్ర మంత్రి శ్రీ తోమర్ మాట్లాడుతూ ఐసీఏఆర్ ఏర్పాటై నేటికి 93 ఏళ్లు పూర్తయ్యాయి. "1929 సంవత్సరంలో స్థాపించబడినప్పటి నుండి ఇప్పటి వరకు, 2014 నుండి ఇప్పటి వరకు ఎనిమిదేళ్లలో విడుదల చేసిన 2,000 రకాలతో సహ సుమారు 5,800 విత్తన రకాలను విడుదల చేసింది. ఇది చాలా ముఖ్యమైన విజయం. వీటిలో విత్తన రకాలు ఉద్యానవన, వాతావరణ అనుకూలమైన మరియు బలవర్థకమైన రకాలు. ఈ రోజు మనం వాతావరణ మార్పు సవాలును ఎదుర్కొంటు న్నాము, కాబట్టి ఇది శాస్త్రవేత్తలకు అత్యంత ఆందోళన కలిగించే విషయం. భారతదేశ వ్యవసాయ ఎగుమతులు మరింత మెరుగయ్యేలా మనం ఈ దిశలో ఒక రోడ్‌మ్యాప్‌తో ముందుకు వచ్చి ఫలితాలను దేశం ముందు ప్రదర్శించాలి. ఇందులో అన్ని కేవీకేలు, ఐసీఏఆర్ ఇన్‌స్టిట్యూట్‌ల ఇతర శాస్త్రవేత్తల పాత్ర కీలకం" అని అన్నారు.

ప్రధానమంత్రి దార్శనికత ద్వారా నూతన విద్యా విధానం పుట్టుకొచ్చిందని, ప్రస్తుతం ఇప్పుడు పాఠశాల విద్యలో వ్యవసాయ పాఠ్యాంశాలు చేర్చబడుతున్నాయని శ్రీ తోమర్ అన్నారు. వ్యవసాయ విద్యా సంస్థలు నూతన విద్యా విధానాన్ని ఎలా అవలంబించాలో, ఈ పనిని ఐసిఎఆర్ చేసిందని, దీని ఫలవంతమైన ఫలితాలను భవిష్యత్తులో చూస్తామని ఆయన అన్నారు.

పప్పుధాన్యాలు, నూనెగింజలు మరియు పత్తి ఉత్పత్తిని పెంచడంతో సహా వ్యవసాయ ఉత్పాదకత రంగంలో దృఢమైన ప్రయత్నాలు చేయాలని ఐసిఎఆర్ మరియు కెవికెలను శ్రీ తోమర్ కోరారు. అంతకు ముందు, వ్యవసాయ మంత్రి దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కొంతమంది రైతులతో ఆన్ లైన్ లో సంభాషించారు. హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్ మొదలైన ప్రాంతాల రైతులతో వ్యవసాయ మంత్రి జరిపిన చర్చల్లో ప్రభుత్వ పథకాలు మరియు సంస్థాగత మద్దతు కారణంగా వారి ఆదాయాలు మరియు జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని వెల్లడైంది.

ఈ కార్యక్రమంలో కేంద్ర మత్స్య, పశు సంవర్ధక మరియు పాడి పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పర్షోత్తమ్ రూపాలా ఐసీఏఆర్ సాధించిన విజయాల చరిత్ర ను డాక్యుమెంట్ చేయాలని సూచించారు. పోషకాలను పెంపొందించే పంటల కొత్త విత్తన రకాలను అభివృద్ధి చేసినందుకు ఐసిఎఆర్ ను ఆయన అభినందించారు. ఈ రంగంలో శ్రేష్ఠమైన కృషి చేసేలా వారిని ప్రోత్సహిస్తూనే, వ్యవసాయ, అనుబంధ రంగాల లో జరుగుతున్న ఆవిష్కరణల వైపు పరిశోధన కేంద్రాల దృష్టిని మళ్లించాలని ఆయన అన్నారు. ప్రధానమంత్రి చొరవతో భారత దేశం నాయకత్వంలో వచ్చే సంవత్సరం అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరాన్ని జరుపుకోనున్న ట్లు ఆయన తెలిపారు. ఈ దృష్ట్యా, ఐసిఎఆర్ ప్రపంచవ్యాప్తంగా పోషకమైన తృణధాన్యాలను ప్రోత్సహించడంపై దృష్టి సారించాలి.

వ్యవసాయాభివృద్ధిలో రైతులతో పాటు ఐసీఏఆర్ శాస్త్రవేత్తలు ఎంతో కృషి చేశారని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ కైలాష్ చౌదరి అన్నారు. ప్రధానమంత్రి నాయకత్వంలో, రైతుల ఆదాయాన్ని పెంచడం, వారికి సౌకర్యాలు మరియు మద్దతు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోంది. 8 ఏళ్ల క్రితం వ్యవసాయ బడ్జెట్ రూ.22 వేల కోట్లు కాగా, ఇప్పుడు రూ.1.32 లక్షల కోట్లకు పెంచబడింది. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద రైతులకు ప్రతి సంవత్సరం 3 విడతల్లో రూ.6,000 నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుండగా, చిన్న రైతుల సమస్యలను ఎఫ్పీవోల ద్వారా పరిష్కరిస్తున్నారు. కొత్త 10,000 ఎఫ్.పి.ఒ.లు ఒక మైలురాయిగా నిలుస్తాయి మరియు వాటి ద్వారా రైతులు తమ ఉ త్పత్తులను దేశంలోనే కాకుండా ప్రపంచంలోని ఏ మూలలోనైనా సులభంగా విక్రయించగలుగుతారు.

నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ రమేష్ చంద్ మాట్లాడుతూ, శ్రీ తోమర్ మాట్లాడిన తీర్మానం తనంతట తానుగా ముఖ్యమని అన్నారు. ప్రతి సంస్థ తన స్వంత తీర్మానాన్ని చేయాలి, తద్వారా అది ప్రతి ఒక్కరి తీర్మానంగా మారుతుంది. కెవికెలను భాగస్వామ్యం చేయడం ద్వారా ఐసిఎఆర్ ఏమి సాధించినా, అది ప్రజలను భాగస్వాములుగా చేయడం ద్వారా చేసింది.

గత 75 సంవత్సరాలలో హరిత విప్లవం యొక్క విజయం జన్యు మెరుగుదల నుండి వచ్చింది. భారత ప్రభుత్వం గొప్ప బాధ్యతతో రెండు మార్గాల్లో నడుస్తోంది. ఒకటి సంప్రదాయ పద్ధతి, రెండవది ? విజ్ఞాన శాస్త్రం.

నంద్యాల్లో అత్యుత్తమ వనితీరు కనబరిచినందుకుగాను వ్యక్తిగత ఉద్యోగులు మరియు బృందాలను ప్రోత్సహించడం మరియు వారి ఉద్యోగ సంతృప్తి స్థాయిలను మెరుగుపరచడంతోపాటుగా వారిని మరింత సమర్థవంతంగా, ప్రతిస్పందించేవిధంగా మరియు ఉత్పాదకంగా తీర్చిదిద్దే తన సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, 4 ప్రధాన కేటగిరీల్లో 15 అవార్డులను మంత్రి ప్రదానం చేశారు. వ్యవసాయ సంస్థలకు నేషనల్ అవార్డ్ ఆఫ్ ఎక్సలెన్స్, నేషనల్ అవార్డ్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ అగ్రికల్చరల్ రీసెర్చ్, నేషనల్ అవార్డ్ ఫర్ అప్లికేషన్ ఆఫ్ అగ్రికల్చరల్ టెక్నాలజీస్, నేషనల్ అవార్డ్ ఫర్ ఇన్నోవేషన్స్ అండ్ టెక్నాలజీ డెవలప్ మెంట్ ఫర్ ఫార్మర్స్ ఈ కేటగిరీల్లో ఉ న్నాయి.

ఈ ఏడాది ఐసిఎఆర్ 4 సంస్థలు, 1 ఆల్ ఇండియా కో ఆర్డినేటెడ్ రీసెర్చ్ ప్రాజెక్ట్, 4 కృషి విజ్ఞాన కేంద్రాలు, 67 శాస్త్రవేత్తలు మరియు 11 మంది రైతులు సహా 15 విభిన్న అవార్డుల కింద 92 మంది అవార్డు గ్రహీతలను ఎంపిక చేసింది, వీరిలో 8 మంది మహిళా శాస్త్రవేత్తలు మరియు రైతులు ఉన్నారు.

ఐసిఎఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ త్రిలోచన్ మహాపాత్ర కూడా ఈ కార్యక్రమంలో ప్రసంగించారు. డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (వ్యవసాయ విస్తరణ) డాక్టర్ ఎ.కె.సింగ్ స్వాగతోపన్యాసం చేశారు. అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ పవన్ కుమార్ అగర్వాల్ ధన్యవాదాలు తెలిపే ఓటును ప్రతిపాదించారు. మహారాష్ట్ర ఎంపీ డాక్టర్ అనిల్ బోండే, ఐసీఏఆర్ అధికారులు, వ్యవసాయ విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లు, శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు. దేశంలోని 731 కేవీకేలు, ఐసీఏఆర్ సంస్థల్లో వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా వేలాది మంది రైతులు, స్థానిక ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు కృషి

హైదరాబాద్, జులై 18: దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం నింపి అభ్యున్నతిని సాధించేలా ప్రభుత్వం చేయూతనందిస్తుందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంత్రి కేటీఆర్ జన్మదినం సందర్భంగా గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా మంత్రులు కేటీఆర్, మల్లారెడ్డి, ఎమ్మెల్సీలు నవీన్‌కుమార్, శంభీపూర్ రాజు, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, వివేకానంద కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన 50 మందికి త్రిచక్ర వాహనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ.. సమాజంలో దివ్యాంగులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం అన్ని రకాల చేయూతనందిస్తుందన్నారు. గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా దివ్యాంగులకు త్రిచక్ర వాహనాలను అందించడం సంతోషంగా ఉందన్నారు. దివ్యాంగులు ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలని.. మేథస్సుతో అన్ని రంగాల్లో సత్తాను చాటాలన్నారు. అనంతరం దివ్యాంగులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ సతీశ్ అరోరా, కార్పొరేటర్లు మందడి శ్రీనివాస్‌రావు, పగుడాల శిరీషాబాబురావు, సబీహాబేగం, పండాల సతీశ్ గౌడ్, ముద్దం నర్సింహ యాదవ్, ఆవుల రవీందర్ రెడ్డి, జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్లు బాబురావు, శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తొలి రోజే.. చారిత్రక రోజు

- ఎంపీగా పార్లమెంట్ లో అడుగిడిన వద్దిరాజు
- తొలిరోజే రాష్ట్రపతి ఎన్నికల్లో దక్కిన ఓటు
- సీఎం కేసీఆర్ కల్పించిన అదృష్టమన్న ఎంపీ



ఖమ్మం, జులై 18: (నేటినిజం ప్రతినిధి): భారత అత్యున్నత ప్రజాస్వామిక వేదిక అది.. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఎందరో రాజకీయ ఉద్దండులు ఆ వేదికకు ప్రాతినిధ్యం వహించారు.. అక్కడ జరిగిన అనేక చారిత్రక పరిణామాలకు అలనాటి యోధాను యోధులంతా ప్రత్యక్ష సాక్షులుగా నిలిచారు. అలాంటి ఉ ద్దండుల సరసన చోటు దక్కించుకున్న వద్దిరాజు రవిచంద్ర మరోసారి చరిత్రకెక్కారు. ఖమ్మం జిల్లా నుంచి రాజ్యసభ ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తూ.. ఆయన సోమవారం పార్లమెంటులో అడుగు పెట్టిన తొలిరోజే.. భారత 16వ రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీంతో ఆయన ఒకే రోజున రెండు చారిత్రక సంఘటనల్లో నమోదయ్యారు. టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే. కేశవరావు నేతృత్వంలో సహచర ఎంపీలతో కలిసి రవిచంద్ర పార్లమెంట్ భవన్ లో ఓటు వేశారు. తన జీవితంలో ఒకే రోజు రెండు అత్యున్నత చారిత్రక సంఘటనలు జరగడం అదృష్టంగా భావిస్తున్నానని ఎంపి వద్దిరాజు పేర్కొన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన సీఎం కేసిఆర్ కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# భద్రాచలం వరద ముంపు ప్రభావిత గ్రామాలను సందర్శించిన పోలీస్ కమిషనర్




భద్రాద్రి కొత్తగూడెం, జులై 18 (నేటి నిజం ప్రతినిధి) :వరద ముంపు గ్రామాలతో పాటు పునరావాస కేంద్రాలను సందర్శించిన పోలీస్ కమిషనర్ విష్ణు యస్. వారియర్ సహాయ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కేంద్రంలో ఎంత మంది ఆశ్రయం పొందుతుంది అడిగి తెలుసుకున్నారు. బాధితులతో మాట్లాడారు. గదులను, భోజన సౌకర్యాలను పరిశీలించారు. పునరావాస కేంద్రాలకు వచ్చిన వారు వర్షాలు లేవని తిరిగి ఇండ్లకు వెళ్లవద్దని, ముప్పు ఇంకా పోలేదని, వెళ్లమని అధికారులు సూచించే వరకు ఇక్కడే ఉండాలని అన్నారు. పునరావాస కేంద్రాలకు వచ్చిన వారి ఇండ్ల వద్ద పోలీస్ పెట్రోలింగ్ చేపట్టి, భద్రతకు చర్యలు చేపడతామని తెలిపారు. వరద నీటి మట్టం తగ్గినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, పరిసరాల శుభ్రపరచడంపై మార్గనిర్దేశం చేశారు.

# అన్ని భాషల విద్యాసంస్థలను నెలకొల్పుతాం..

హైదరాబాద్, జులై 18:;'కులాలు, మతాల ఆధారంగా మేం చిల్లర రాజకీయాలు చేయం. మాది లౌకిక ప్రభుత్వం. అన్ని భాషలు, యాసలకు ప్రాధాన్యమిస్తున్నాం. తెలుగు, ఇంగ్లిషు, ఉర్దూ భాషలపై వ్యత్యాసాలు లేవు. అన్ని భాషల విద్యాసంస్థలను ఏర్పాటు చేస్తాం. ఉర్దూను ముస్లింల భాషగా చిత్రీకరించేందుకు కొందరు సన్నాసులు ప్రయత్నాలు చేస్తున్నారు. కేజీ నుంచి పీజీ వరకు ప్రభుత్వం ఉచిత విద్యనందిస్తుండడంతో చక్కటి ఫలితాలు వస్తున్నాయి. గురుకులాల ఏర్పాటుతో విద్యావ్యవస్థలో అనేక మార్పులొచ్చాయి. ఇప్పటివరకు వెయ్యిమందికిపైగా విద్యార్థులకు ఐఐటీ సీట్లు లభించాయి. 1052 గురుకులాలను అప్‌గ్రేడ్ చేశాం. 68 ఏండ్లు పాలించిన వారు.. ఏమి చేయకుండా ఇయ్యాల ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. వారి గురించి పట్టించుకోవద్దు' అని ఐటీ, పురపాలక శాఖల మంత్రి కేటీఆర్ సూచించారు. రూ.2.5 కోట్లతో మేడ్చల్ జిల్లా బహదూర్‌పల్లిలో నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కాలేజీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రు లు సబితారెడ్డి, మల్లారెడ్డి, ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

మతాలు, కులాల ఆధారంగా చిల్లర రాజకీయాలు చేసే ప్రభుత్వం మాది కాదు..తెలుగు, ఇంగ్లిషు, ఉర్దూ భాషలపై ఎలాంటి వ్యత్యాసాలు లేవు. విద్యార్థులకు అవసరమయ్యే అన్ని భాషల విద్యాసంస్థలను ఏర్పాటు చేస్తాం. కొందరు అవివేకులు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు. ఉర్దూను ముస్లింల భాషగా చిత్రీకరించేందుకు కొందరు మూర్ఖులు, సన్నాసులు ప్రయత్నిస్తున్నారు. వారి గురించి పట్టించుకోవాల్సిన అవసరం లేదు. ప్రపంచస్థాయిలో విద్యార్థులు పోటీపడేలా రాష్ట్రంలో విద్యావిధానాన్ని అమలు చేస్తున్నాం' అని ఐటీ,పురపాలక శాఖల మంత్రి కేటీఆర్ వెల్లడించారు.

మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బహదూర్‌పల్లిలో రూ.2.5 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కాలేజీ భవనాన్ని మంత్రులు సబితారెడ్డి, చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుతో కలిసి శనివారం మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఒకేషనల్ కళాశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన సభలో కేటీఆర్ మాట్లాడారు. రాష్ట్రం ఆవిర్భవించిన 8 ఏండ్లలో ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యారంగంలో అనేక మార్పులు తెచ్చారని, ప్రాథమిక నుంచి ఉన్నతవిద్య వరకు ఉచితంగా అందిస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1052 గురుకులాల్లో ఐదు లక్షల మంది విద్యార్థులున్నారని..ఒక్కొక్కరిపై రూ.1.20 లక్షలు ఖర్చు చేస్తూ వారికి నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఫలితంగా ఇప్పటివరకు 1000 మందికంటే ఎక్కువ విద్యార్థులు ఐఐటీ సీట్లు సాధించారని ప్రకటించారు. 1052 గురుకులాలను కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేయడం ఎంతో గర్వకారణమన్నారు.

విద్యావ్యవస్థలో 68 సంవత్సరాల్లో జరగని అభివృద్ధి, మార్పులు, అవకాశాలు 8 ఏండ్లలో జరిగాయని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రతి జిల్లాకు మెడికల్ కాలేజీని మంజూరు చేశామని, వీటితోపాటు అగ్రికల్చర్, లా, డిగ్రీ కాలేజీలు, రెండు యూనివర్సిటీలను మంజూరు చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఎప్పుడూ సిద్ధమేనని, విద్యార్థులు అందుకనుగుణంగా కష్టపడాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత సాధించామని..ఇది ప్రభుత్వ చదువుకు నిదర్శమని గుర్తుచేశారు. రాష్ట్రంలో 68 సంవత్సరాల్లో అభివృద్ధి చేయగలిగే అవకాశం ఉండి కూడా చేయలేని వారి గురించి పట్టించుకోవద్దని, రాష్ట్ర ప్రభుత్వం చేసిన పథకాలు, అభివృద్ధిని ఢంకా బజాయించి చెబుతున్నామని వివరించారు.

కేజీ నుంచి పీజీ వరకు ఉచితవిద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తుందని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక్కో రంగాన్ని బాగు చేసుకుంటూ వస్తున్నారని, విద్యావ్యవస్థలో అనూహ్య మార్పులు తీసుకొచ్చినట్లు చెప్పారు. ప్రస్తుతం 60శాతం ఆడపిల్లలు ఉన్నత చదువులు అభ్యసిస్తున్నారని, వీరి ఉత్సాహాన్ని చూసి ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళా యూనివర్సిటీని మంజూరు చేశారని వెల్లడించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, విద్యాశాఖ మౌలిక వసతుల సంస్థ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, ఇంటర్ విద్యాశాఖ కమిషనర్ ఉమర్ జలీల్, టీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి, నిజాంపేట మున్సిపల్ మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి, దుండిగల్, కొంపల్లి మున్సిపల్ చైర్మన్లు సుంకరి కృష్ణవేణి, సన్న శ్రీశైలంయాదవ్, జిల్లా గ్రంథాలయ కమిటీ చైర్మన్ నాగరాజుయాదవ్, కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, జగన్, విజయశేఖర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మావి స్కీమ్‌లు..వారివి స్కామ్‌లు : మల్లారెడ్డి, కార్మిక మంత్రి

# బోనాల ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు -ఎమ్మెల్యే ముఠా గోపాల్



హైదరాబాద్, జులై 18: నియోజకవర్గంలో త్వరలో జరుగనున్న బోనాల ఉత్సవాలకు ఏర్పాట్లు ఘనంగా చేయనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన నేథ్యంలో గుంతల రోడ్లకు మరమత్తులు, కొత్త డ్రైనేజీ పైపులైన్ ఏర్పాటు పనులు వేగంగా చేపట్టనున్నట్లు చెప్పారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే బోనాల ఉత్సవాల నిర్వహణ, వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమత్తులు, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకల ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని 180కి పైగా ఉన్న అమ్మవారి ఆలయాల వద్ద బోనాల ఉత్సవాలకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు.

టీఆర్ఎస్ శ్రేణులు స్వయంగా ఏర్పాట్లను పరిశీలిస్తూ ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయాల వద్ద మంచినీరు, డ్రైనేజీ, వీధి దీపాలు, ఫుట్‌పాత్‌లు, అలంకరణ వంటి ఏర్పాట్లు చూడాలని పిలుపునిచ్చారు. డివిజన్ కమిటీల ప్రతినిధులు బస్తీల్లో పర్యటించి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి దగ్గరుండి గుంతల రోడ్లకు మరమ్మతులు చేయించాలన్నారు. రాంనగర్ సాయిబాబా టెంపుల్, గణేష్ నగర్ లక్ష్మమ్మ పార్కు, రాంనగర్ రామాలయం వీధిలో త్వరలో డ్రైనేజీ సమస్యల పరిష్కారం కోసం కొత్త పైపులైన్‌లు ఏర్పాటు చేయనున్నామని ఇందుకోసం ప్రతిపాదనలు సైతం సిద్ధమయ్యాయని, త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. ప్రమాదకరంగా ఉన్న హైటెన్షన్ విద్యుత్ లైన్‌లను తొలగించడానికి కృషి చేయనున్నట్లు తెలిపారు.

నియోజకవర్గంలో బోనాల ఉత్సవాలతోపాటు టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్ జన్మదిన సందర్భంగా 24వ తేదీన భారీ ఏర్పాట్లు చేయాలని డివిజన్ కమిటీల నేతలకు సూచించారు. ఫ్లెక్సీలు, సేవా కార్యక్రమాలు, కేక్ కటింగ్‌లు వంటి కార్యక్రమాల నిర్వహణకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం నేత ముఠా జయసింహ, మాజీ కార్పొరేటర్ ముఠా పద్మ, డివిజన్ల అధ్యక్షుడు రావులపాటి మోజస్, కాడబోయిన నర్సింగ్ ప్రసాద్, బి.శ్రీనివాస్ రెడ్డి, వై.శ్రీనివాస్, రాకేష్, శ్యామ్ యాదవ్, నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, ముఠా నరేష్, మల్లిఖార్జున్‌రెడ్డి, రవియాదవ్, సయ్యద్ అస్లాం, శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్, శివముదిరాజ్, సుబ్బారావు, మాధవి, శోభ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగార్థులకు గుడ్‌న్యూస్.. కేయూలో ఉచిత కోచింగ్

వరంగల్, జులై 18: ప్రభుత్వ ఉద్యోగార్థులకు కాకతీయ యూనివర్సిటీ శుభవార్త వినిపించింది. వర్సిటీలోని ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్ సెమినార్ హాల్‌లో ఉచిత కోచింగ్‌ను కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ తాటికొండ రమేష్ మాట్లాడుతూ.. ఉత్తమమైన ఫ్యాకల్టీతో కోచింగ్ ఇప్పిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని ఉద్యోగార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్యాంపస్‌లోని మెయిన్ లైబ్రరీలో ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంచేందుకు కృషి చేస్తామని చెప్పారు. ప్రతి ఒక్క అభ్యర్థి చిత్తశుద్ధితో చదివి, ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని వీసీ పిలుపునిచ్చారు.

ఈ ఉచిత కోచింగ్ మూడు నెలల పాటు కొనసాగుతుందని కాంపిటీటీవ్ ఎగ్జామినేషన్స్ సెల్ డైరెక్టర్ డాక్టర్ టీ నాగయ్య వెల్లడించారు. ఈ ఉచిత కోచింగ్‌కు 800 మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్జామినేషన్ కంట్రోలర్ ప్రొఫెసర్ మల్లారెడ్డి, ప్రొఫెసర్ రామచంద్రం, ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ బ్రహ్మేశ్వరి, డాక్టర్ సబితా జ్యోత్స్నం, డాక్టర్ సుజాత, డాక్టర్ వాసుదేవ రెడ్డి, డాక్టర్ మధుకర్, డాక్టర్ రాజ్ కుమార్, డాక్టర్ భాస్కర్, డాక్టర్ శ్రీధర్ కుమార్ లోధ్, డాక్టర్ సుచిత్రా పాల్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# బైక్‌ను ఢీకొట్టి.. వంతెనపై నుంచి కాలువలోపడ్డ యూఎస్‌వీ.. ఆరుగురు మృతి



అమరావతి, జులై 18: మహారాష్ట్ర అమరావతి జిల్లాలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకున్నది. ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఎస్‌యూవీ ఆ తర్వాత.. వంతెనపై నుంచి కాలువలో పడిపోయింది. ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందగా.. ఒకరు గాయపడ్డట్లు పోలీసులు తెలిపారు. పరత్వాడా ? బేతుల్ హైవేపై నింభోరా ఫాటా (మల్లింపు) ప్రాంతంలో ఈ ప్రమాదం చోటు చేసుకుందని పోలీసులు పేర్కొన్నారు.

భారీ వర్షాల నేపథ్యంలో తక్కువ దృశ్యమానత మధ్య ఆదివారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుందని పోలీసులు చెప్పారు. ప్రమాదంలో మొత్తం ఆరుగురు మృతి చెందారన్నారు. షిరాజ్‌గావ్ పోలీస్ స్టేషన్ నుంచి వచ్చిన పెట్రోలింగ్ పార్టీ ఆదివారం అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో రోడ్డుపై పడి ఉన్న ఎస్‌యూవీ సీటు పడి ఉండడాన్ని గమనించింది. అందులో గాయపడ్డ వ్యక్తిని కాపాడి.. ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. మృతదేహాలను స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం అచల్‌పూర్‌లోని ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# రాజ్యసభకు వస్తానని ఎప్పుడూ ఊహించలేదు : కేవీ విజయేంద్ర ప్రసాద్

న్యూఢిల్లీ, జులై 18: సినీ రచయిత, ప్రముఖ దర్శకుడు రాజమౌళి తండ్రి కేవీ విజయేంద్ర ప్రసాద్ రాజ్యసభ సభ్యునిగా ఇవాళ ప్రమాణస్వీకారం చేశారు. రాజ్యసభ చైర్మన్ వెంకయ్య నాయుడు.. విజయేంద్ర ప్రసాద్ చేత ప్రమాణం చేయించారు. రాష్ట్రపతి కోటాలో విజయేంద్ర రాజ్యసభకు నామినేట్ అయిన సంగతి తెలిసిందే.

ప్రమాణస్వీకారం అనంతరం పార్లమెంట్ ఆవరణలో విజయేంద్ర ప్రసాద్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రపతి కోటాలో రాజ్యసభకు రావడం సంతోషంగా ఉందన్నారు. రాజ్యసభకు వస్తానని తాను ఎప్పుడూ ఊహించలేదు. తన కథలే తనను రాజ్యసభకు తీసుకొచ్చాయి. రాజ్యసభకు నామినేట్ కావడం తన బాధ్యతను మరింత పెంచింది. ప్రజా సమస్యలను రాజ్యసభ దృష్టికి తీసుకెళ్తాను అని విజయేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు.

# దేశంలో సాగు స్థితిగతులను మార్చేసిన వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకులు



న్యూఢిల్లీ, జులై 18: ఈ రోజు న్యూఢిల్లీలో జరిగిన వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకుల (ఎ.ఆర్.డి.బి.ల) జాతీయ సదస్సులో కేంద్ర హోమ్, సహకార శాఖ మంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేంద్ర సహకార, ఈశాన్య రాష్ట్రాల వ్యవహారాల సహాయమంత్రి బి.ఎల్. వర్మ,కేంద్ర సహకార మంత్రిత్వ శాఖకార్యదర్శి, భారత జాతీయ సహకార సంఘాల యూనియన్ (ఎన్.సి.యు.ఐ.) అధ్యక్షుడు, ఇఫ్కో చైర్మన్ దిలీప్ సంఘానీ, అంతర్జాతీయ సహకార కూటమి ఆసియా పసిఫిక్ ప్రాంతీయ అధ్యక్షుడు, కృషక్ భారతి సహకార సంఘం (క్రిభ్‌కో) చైర్మన్ డాక్టర్ చంద్రపాల్ సింగ్ యాదవ్, పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కేంద్ర హోమ్, సహకారశాఖ మంత్రి అమిత్ షా మాట్లాడుతూ, వ్యవసాయ అభివృద్ధికి సహకారసంఘాల విస్తృతి చాలా ముఖ్యమని, సహకార సంఘాల విస్తరణ లేకుండా, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కలలను సాకారం చేయజాలమని అన్నారు. దేశంలో వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకుల పురోగతికి దాదాపు 9 దశాబ్దాల చరిత్ర ఉందన్నారు. స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు వ్యవసాయ రుణ వ్యవస్థకు రెండు మూలస్తంభాలని అన్నారు. 1920వ సంవత్సరానికి ముందు కాలంలో వ్యవసాయ రంగం పూర్తిగా వర్షాలపైనే ఆధారపడి ఉండేదని, వర్షాలు వచ్చినపుడు మాత్రమే వ్యవసాయం మంచి దిగుబడిని ఇచ్చేదని అన్నారు. 1920వ పడిలో రైతులకు దీర్ఘకాలిక రుణాల సదుపాయం ప్రారంభమైందని, దీనితో తన పొలంలోనే మౌలిక సదుపాయాలను నెలకొల్పుకోవాలన్న రైతుల కలలు సాకారం కావడం మొదలైందని అన్నారు. కేవలం వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకులు మాత్రమే దేశ వ్యవసాయ రంగాన్ని మార్చివేశాయని, దీనితో అదృష్టం ప్రాతిపదికన జరిగే వ్యవసాయం, శ్రమ ఆధారిత వ్యవసాయంగా మారిందని అన్నారు. రైతులను స్వావలంబన సాధించేలా మార్చడంలో సహకార రంగం విస్తృతి ఎంతగానో దోహదపడిందని అన్నారు. వ్యవసాయ రంగం అభివృద్ధికి ఎన్నో అడ్డంకులు ఉన్నాయని, దీర్ఘకాలిక రుణ వ్యవస్థను పెంపొందించనిదే వ్యవసాయాభివృద్ధి సాధ్యం కాదన్నది ప్రధానమంత్రి భావన అని అన్నారు. బ్యాంకులు దెబ్బతిన్న పెద్ద రాష్ట్రాలు కూడా ఉన్నాయని, ఈ అంశాన్ని కూడా మనం పరిశీలించవలసిన అవసరం ఉందని అమిత్ షా అన్నారు. వ్యవసాయేతర వినియోగంకోసం అదనపు నిధులను అభివృద్ధి చేయడం వల్ల ఎలాంటి ఉపయోగం ఉండబోదన్నారు. అందుబాటులోని నిధులన్నింటినీ గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ రంగాలపై ఖర్చుపెట్టినప్పుడే జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డ్) లక్ష్యాలు నెరవేరుతాయని అన్నారు. వ్యవసాయంలో దీర్ఘకాలిక రుణ వ్యవస్థ, మౌలిక సదుపాయాలు, సూక్ష్మ సాగు వంటి విధానాలను ప్రోత్సహించనిదే నాబార్డ్ లక్ష్యాలు పూర్తిగా నెరవేరబోవని ఆయన అన్నారు.

వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకుల పని కేవలం రుణసదుపాయం అందించడంతోనే పూర్తికాబోదని, అవి తమ కార్యకలాపాలను మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఉందని అమిత్ షా అన్నారు. విస్తరణ ప్రక్రియలో ఎలాంటి అడ్డంకులు ఎదురైనా వారిని తొలగించే మార్గాలను మనం అన్వేషించాలని అప్పుడే వ్యవసాయ అభివృద్ధి లక్ష్యాన్ని సాధించగలమని ఆయన అన్నారు. మనం బ్యాంకులను నిర్వహించడం మాత్రమే కాక, బ్యాంకింగ్ లక్ష్యాలను నెరవేర్చేందుకు కూడా పనిచేయాలని అన్నారు.

దీర్ఘకాలిక రుణాల లక్ష్యాలను సాధించేందుకే సహకార సంఘాలను రూపొందించారని, కొత్త సహకార సంఘాలను ఏర్పాటు చేయడం ద్వారా, రైతులందరికీ మధ్యకాలిక, దీర్ఘకాలిక రుణాలను అందించాల్సి ఉందని ఆయన సూచించారు.

సత్వర రుణమంజూరీ వ్యవస్థను, రుణాల వసూలు వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అమిత్ షా అన్నారు. సహకార రంగంలో సేవలను మరింత విస్తృతం చేయాలని, సేద్యపునీటి సదుపాయంతో సాగయ్యే భూమి శాతాన్ని, దిగుబడిని, ఉత్పాదనను పెంచే అంశంపై మరింత విపులంగా చర్చించాలని, రైతులను సుసంపన్నం చేయాలని, సహకార రుణాలపై రైతులకు అవగాన కల్పించాలని ఆయన సూచించారు. సహకార సంఘాల్లో కేవలం పదవిలో ఉన్నంత మాత్రాన సరిపోదని, 1924లో సహకార సంఘాలను ఎందుకు స్థాపించారో ఆ లక్ష్యాలను సాధించే విషయమై శ్రద్ధగా ఆలోచించాలని అన్నారు. బ్యాంకులు 3 లక్షల ట్రాక్టర్ల కొనుగోళ్లకు రుణం అందించాయని, దేశంలో 8లక్షలకుపైగా ట్రాక్టర్లు ఉన్నాయని అన్నారు. 13కోట్ల మంది రైతుల్లో 5.2లక్షల మంది రైతులకు మాత్రమే మనం మధ్యకాలిక, దీర్ఘకాలిక రుణాలు అందించామన్నారు. బ్యాంకులు ఎన్నో సంస్కరణలు చేపట్టాయని, అయితే వ్యవసాయ రంగానికి పూర్తిగా ప్రయోజనం అందించేలా సంస్కరణలు ఉండాలని అన్నారు.

ఏదైనా బ్యాంకు మంచిపనిచేసిన పక్షంలో సహకార సమాఖ్య దాన్ని గురించి అన్నిబ్యాంకులకు ఆ సమాచారాన్ని తెలియజేసి, ముందుకు తీసుకెళ్లాలన్నారు. బ్యాంకింగ్ రంగానికే ప్రయోజనం కలిగించేలా సంస్కరణలు ఉండాలని అప్పుడే సహకార రంగం మరింత బలోపేతమనవుతుందన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార రంగాల పరిధిలోకి బావులు, పంపుసెట్లు, భూమి అభివృద్ధి, ఉద్యానవన సాగు, పౌల్ట్రీ, మత్స్య పరిశ్రమ వంటి వాటిని చేర్చారని, అయితే ఈ వ్యవస్థను విస్తరింపచేడయం మన బాధ్యత అని అన్నారు. అప్పుడే సహకార సంఘాల లక్ష్యం నెరవేరుతుందన్నారు. ఈ రోజు ఈ సదస్సుకు హాజరవుతున్న బ్యాంకు సభ్యులంతా సహకార రంగం ఉత్తమ విధానాలపై చర్చించాలని, బ్యాంకింగ్ రంగంలో ఏవైనా సంస్కరణలు అసరమైనపక్షంలో, అందుకు సంబంధించిన సూచనలను స్వీకరించడానికి సహకార మంత్రిత్వ శాఖ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని అన్నారు.

దేశంలో వ్యవసాయ రుణాల వ్యవస్థ ఒక విధంగా దెబ్బతిని ఉందని, చాలా వరకు ప్రాంతాల్లో వ్యవస్థ కార్యకలాపాలు చక్కగా సాగుతున్నప్పటికీ, పలు రాష్ట్రాల్లో ఇది చెల్లాచెదురైందని అన్నారు. ఆయా ప్రాంతాల్లో పరిస్థితిని చక్కదిద్ది, నిస్సహాయంగా ఉన్న రైతులను ఆర్థికాభివృద్ధి బాటలో నిలిపాల్సి ఉందని, ఇందుకోసం సహకార రంగాన్ని సమర్ధవంతంగా నిర్వహించాలని అమిత్ షా అభిప్రాయపడ్డారు. సహకార రంగంలో పెట్టుబడికి ఎలాంటి నిధుల లోపం లేదని, రుణాల వ్యవస్థను, మన మౌలిక సదుపాయాలను పునరుద్ధరించవలసి ఉందని, ఈ కార్యకలాపాలు సమస్యాత్మక ప్రాంతాలను ప్రతి స్టేట్ బ్యాంకు గుర్తించాల్సిన అవసరం ఉందని అన్నారు. రైతులు, తమకు అవసరమైన మధ్యకాలిక, దీర్ఘకాలిక ఆర్థిక సహాయం పొందేందుకు వీలుగా నాబార్డ్ కూడా రుణాల వ్యవస్థ విస్తరణ విభాగాన్ని రూపొందించాలన్నది తన అభిప్రాయమని అన్నారు. అవసరమైన మేరకు సంస్థాగత రుణాల వ్యవస్థను వర్తింపజేయడం ఇప్పటి ఆవశ్యకత అని అన్నారు. స్వల్పకాలిక పరపతి వ్యవస్థ కంటే దీర్ఘకాలిక పరపతి వ్యవస్థకు ఎప్పటికీ ఎక్కువ స్థాయిలో ప్రాధాన్యం ఉండాలని అన్నారు. దీర్ఘకాలిక ఆర్థిక వ్యవస్థ పెరిగేకొద్దీ వ్యవస్థ మెరుగవుతూ వస్తుందని, దీనితో స్వల్పకాలిక రుణ వ్యవస్థ కూడా దానంతట అదే పెరుగుతూ వస్తుందని అన్నారు.

పాతికేళ్ల కిందట దీర్ఘకాలిక రుణాల వాటా 50శాతం ఉండేదని, ప్రస్తుతం ఇపుడు ఈ వాటా 25శాతానికి తగ్గిందని, ఇది ఆందోళనకరమైన పరిణామమని అన్నారు. అస్సాం, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోయిందని అన్నారు. ప్రస్తుతం దేశంలోని 13రాష్ట్రాల్లోని వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకులు మాత్రమే ప్రభుత్వ ఆశయాలు, ప్రమాణాల మేరకు పనిచేస్తున్నాయని అన్నారు.

వ్యవసాయ భూమి అందుబాటు విషయంలో ప్రపంచంలో భారతదేశం స్థానం ఏడవ స్థానంసో ఉందని, వ్యవసాయ కార్యకలాపాల్లో మాత్రం మనం అమెరికా తర్వాతి స్థానంలో అంటే రెండవ స్థానంలో ఉన్నామని అన్నారు. ఈ పరిస్థితుల్లోనే నాబార్డ్ ఏర్పాటైందని, మనం 39.4కోట్ల ఎకరాల భూమిని పూర్తిగా సేద్యపునీటి సదుపాయం కల్పిస్తే, రైతులు దేశంలోనే కాక, ప్రపంచం ఆకలి బాధలను నిర్మూలించగలుగుతారని అమిత్ షా అన్నారు. ఒక వేళ సేద్యపునీటి వ్యవస్థకు తగినంత నీటి సదుపాయం లేని పక్షంలో సూక్ష్మ నీటిపారుదల వ్యవస్థ దిశగా ముందుకు సాగాల్సి ఉందని, భూమి కమతాలు చిన్నవిగా మారిన పక్షంలో సహకార సంఘాల సహాయంతో సాగునీటిని సదుపాయాన్ని కల్పించాలని అన్నారు. మన అసరాలకు తగినట్టుగా బ్యాంకులను పునర్వ్యవస్థీకరించాల్సి ఉందని, ప్రభుత్వం, నాబార్డ్, సహకార సమాఖ్య ఈ దిశగా తగిన కృషి చేయాలని అన్నారు. ప్రతి రాష్ట్రంలోనూ బలమైన దీర్ఘకాలిక రుణాల వ్యవస్థను ఎలా ఏర్పాటు చేయాలన్న అంశంపై రానున్న రోజుల్లో నాబార్డ్, సమాఖ్య, సహకార శాఖలతో ఒక ఉమ్మడి సమావేశాన్ని తాను ఏర్పాటు చేయబోతున్నానని అమిత్ షా చెప్పారు. ఇందుకోసం సహకార సమాఖ్య కీలకపాత్ర పోషించాల్సి ఉందన్నారు.

సహకార వ్యవస్థ అభివృద్ధి కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో పలు చర్యలు తీసుకున్నట్టు కేంద్రమంత్రి అమిత్ షా చెప్పారు. ప్రాథమిక వ్యవసాయ, సహకార సంఘాలను (పి.ఎ.సి.ఎస్.లను) అన్నింటినీ రూ. 2,500కోట్లతో కంప్యూటరీకరించేందుకు చర్యలు తీసుకోవడం చాలా గొప్ప విషయమని అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, జిల్లాల సహకార బ్యాంకులు, రాష్ట్రస్థాయి సహకార బ్యాంకులు, నాబార్డ్ల అక్కౌంటింగ్ వ్యవస్థలు ఆన్‌లైన్‌లో అనుసంధానం కాబోతున్నాయని దీనితో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను పారదర్శకంగా నిర్వహించడానికి వీలవుతుందని, ఇది చాలా ప్రయోజనకరమని అన్నారు. ఒక సహకార విశ్వవిద్యాలయం నెలకొల్పాలని సూత్రప్రాయంగా ఒక నిర్ణయం తీసుకున్నామని అన్నారు. ప్రస్తుతం రూ. వంద కోట్ల కంటే ఎక్కువ వ్యాపారం చేసే యూనిట్లన్నీ జి.ఇ.ఎం. వేదికపై కొనుగోళు జరపగలుగుతున్నాయని, దీనితో ఉత్పాదనల సేకరణ ప్రక్రియ కూడా చవుకగా మారుతుందని, దీనితో అవినీతిని కూడా నిర్మూలించినట్టవుతుందని అన్నారు.

దేశంలో సహకార సంఘాలకు సంబంధించిన సమాచార వ్యవస్థ (డాటాబేస్) లేదని, డాటాబేస్ లేనిదే విస్తరణ కార్యకలాపాల గురించి ఆలోచించడం సాధ్యంకాదని అన్నారు. తీరప్రాంతాల్లోని రాష్ట్రాల్లో మత్స్యకార్మికులకు సహకార సంఘాలు అందుబాటులో లేవన్నది తెలుసుకునే డాటాబేస్ మనకు లేదని అన్నారు. దేశంలో ఎన్ని సహకార సంఘాలు పనిచేస్తున్నాయో, ఎన్ని గ్రామాలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు నోచుకోలేదో.. అన్న సమాచారం తెలిపే డాటాబేస్ కూడా మనకు అందుబాటులో లేదని అన్నారు. ఈ నేపథ్యంలో ఎంతో ప్రయోజనకరమైన ఈ డాటాబేస్‌ను ఏర్పాటుచేసే ప్రక్రియను తాము ప్రారంభించామన్నారు. విస్తరణ ప్రక్రియ ఎక్కడ అవసరమో తెలిసినపుడే విస్తరణ జరిగే అవకాశం ఉంటుందని, ఇందుకు సంబంధించిన మౌలికవరమైన కార్యకలాపాలను కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ ప్రారంభించిందని అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకోసం నమూనా నిబంధనల తయారీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, సహకార ఉద్యమంలో పాలుపంచుకునే వారంతా తమ అనుభవాల ఆధారంగా తగిన సూచనలను ప్రభుత్వానికి పంపించాలని తాను విజ్ఞప్తి చేస్తున్నట్టు అమిత్ షా చెప్పారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను బహుముఖ ప్రయోజనాల సంస్థలుగా తీర్చిదిద్దాలన్నది తమ అభిమతమని అన్నారు. గ్యాస్ పంపిణీ, నిల్వ, చవుక ధాన్యాలకోసం దుకాణాలను పరిగణనలోకి తీసుకోవడం వంటి కార్యకలాపాలను పి.ఎ.సి.ఎస్.లు చేపట్టవచ్చని వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాలుగా అవి మారవచ్చని, కమ్యూనికేషన్ కేంద్రాలుగా రూపుదిద్దుకోవచ్చని, కుళాయిల ద్వారా నీటి సరఫరాను చేపట్టవచ్చని ఆయన అన్నారు. కంప్యూటర్ సదుపాయంతో అనుసంధానించిన వక్షంలో ఈ కార్యకలాపాలన్నీ చేపట్టవచ్చని అన్నారు. ఎప్పుడో 70-80 ఏళ్ల కింద రూపొందించిన నిబంధనలను, బై-లాస్‌ను పూర్తిగా మార్చవలసిన అవసరం ఉందన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో సహకార స్ఫూర్తిని తాము ఏమాత్రం తగ్గించడం లేదని, ఆ సంఘాలకు కొత్త కార్యకలాపాలను, విధులను జోడించేందుకు తాము కృషి చేస్తున్నామని అన్నారు.

సహజ వ్యవసాయ ఉత్పాదనలను మార్కెటింగ్‌కు సంబంధించిన ప్రాథమిక పనులను అమూల్ సంస్థ కూడా నిర్వర్తిస్తోందని అమిత్ షా అన్నారు. చేతి పని వస్తువులను, హస్తకళా ఖండాల మార్కెటింగ్ కోసం బహుళ విధుల రాష్ట్ర సహకార సంఘాలను ఏర్పాటు చేసే విషయం తాము యోచించామని అన్నారు. విత్తన సంస్కరణలకు సంబంధించిన బాధ్యతలను భారతీయ వ్యవసాయ ఎరువుల సహకార సంఘానికి ('ఇఫ్కో'కు), క్రిభ్కోకు అప్పగించామని, ఎగుమతులకోసం బహుళ రాష్ట్రాల సహకార ఎగుమతుల సంస్థ ఏర్పాటు కాబోతున్నదని, ఇందుకు సంబంధించి భారత ప్రభుత్వం ఆగస్టు 15వ తేదీలోగా చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఇది వాస్తవ రూపం దాల్చేలా తాము తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సహకార మంత్రిత్వ శాఖకు భారీ స్థాయిలో కేటాయింపును పెంచాలన్న ప్రతిపాదనకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇప్పటికే ఆమోదం తెలిపారని అన్నారు. వ్యవసాయాభివృద్ధి కోసం నరేంద్ర మోదీ సారథ్యంలో ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని, ఈ నేపథ్యంలో కనీస మద్దతు ధర (ఎం.ఎస్.పి.) గురించి తాను తప్పనిసరిగా ప్రస్తావించాల్సి వస్తుందని అమిత్ షా అన్నారు.

దేశంలో వరిధాన్యం సేకరణ దాదాపు 8శాతం పెరిగిందని, 2014-15వ సంవత్సరంలో 475లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్య సేకరణ జరగ్గా, ఇపుడు 896 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యం సేకరణ జరిగిందని, లబ్ధి పొందిన రైతుల సంఖ్య కూడా 76లక్షలనుంచి కోటీ 31లక్షలకు పెరిగిందని అన్నారు. గోధుమల సేకరణ 72శాతం పెరిగిందని, ఇంతకుముందు 251లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయగా, ఈరోజున 433లక్షల మెట్రిక్ టన్నుల గోధులను కొనుగోలు చేసినట్టు తెలిపారు. కిసాన్ క్రెడిట్ కార్డు, సేంద్రియ వ్యవసాయానికి, సహజ వ్యవసాయానికి ఇతోధిక ప్రోత్సాహం లభిస్తోందని, వ్యవసాయ ఎగుమతులు వంటివి తొలిసారిగా 50 బిలియన్ల అమెరికన్ డాలర్ల స్థాయికి చేరాయని అన్నారు.

"ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన" పథకంకిందగత ఎనిమిదేళ్లలో వ్యవసాయ భూమి విస్తీర్ణం 64లక్షల హెక్టార్లు పెరిగిందన్నారు. గతంలో 70ఏళ్లలో పెరిగిన వ్యసాయ భూమి విస్తీర్ణం కేవలం 64లక్షల హెక్టార్లు మాత్రమేనని అన్నారు. వ్యవసాయ మౌలిక సదపాయాల్లో ప్రభుత్వ పెట్టుబడి పెరిగేకొద్దీ, సహకార సంఘాల సామర్థ్యం, ప్రత్యేకించి వ్యవసాయ పరపతిలో సహకార సంఘాల సామర్థ్యం పెరుగుతుందని ఆయన అన్నారు. దేశంలో వ్యవసాయ యాంత్రీకరణ కూడా ప్రారంభమైందని, 10,000వరకూ వ్యవసాయ ఉత్పత్తిదార్ల సంఘాల (ఎఫ్.పి.ఒ.,)కోసం రూ. 6,800కోట్ల బడ్జెట్‌ను ఖర్చు పెట్టారని, మండీల్లో డిజిటల్ లావాదేవీలు భారీస్థాయిలో పెరిగాయని అమిత్ షా అన్నారు. సహకార రంగాన్ని ప్రభుత్వం మాత్రవే విస్తరించడం సాధ్యంకాదని, సహకార సంఘాలు కూడా తమంత తాముగా ఆ పనిచేయాల్సి ఉంటుందని అమిత్ షా అన్నారు. ప్రభుత్వం సదుపాయాలను మాత్రవే ఏర్పాటు చేయగలదని, సహకార సంఘాల స్ఫూర్తిని పునరుద్ధరించడం, భవిష్యత్తులో అదే స్ఫూర్తిని పెంపొందించేలా చేయడం, ఇలాంటి సహకార రంగాన్ని సృష్టించడం మన బాధ్యతేనని అన్నారు. సహకార స్ఫూర్తిని పునరుద్ధరించి, సహకార లక్ష్యాల సాధనకోసం అంకిత భావంతో కృషిని కొనసాగించినపుడు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కలలుగన్న 5 ట్రిలియన్ల అమెరికన్ డాలర్ల స్థాయికి ఆర్థికవ్యవస్థను చేర్చడంలో సహకార సంఘాలు మరింత గొప్ప పాత్ర పోషిస్తాయని అన్నారు. దేశంలోని 70కోట్ల మంది పేదలను సమ్మిళిత అభివృద్ధి ప్రక్రియలో భాగస్వాములను చేయగలిగే సామర్థ్యం కలిగినది సహకార రంగం మాత్రమేనని కేంద్ర హోమ్, సహకారశాఖల మంత్రి అమిత్ షా అన్నారు.

# మద్దతు పొందడమే కాదు, హామీలు నెరవేర్చాలి.. రాష్ట్రపతి ఎన్నికల్లో వైఎస్సార్సీపీ ఎంపీలు

న్యూఢిల్లీ, జులై 18: రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి వంటి ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి మద్దతు పొందడమే కాదు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన విభజన హామీలు కూడా నెరవేర్చాలని అనకాపల్లి ఎంపీ డా. సత్యవతి అన్నారు. పార్లమెంటు భవనంలో జరిగిన రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటేసిన అనంతరం ఆంధ్రప్రదేశ్ భవన్‌లోని గురజాడ కాన్ఫరెన్స్ హాలులో వైఎస్సార్సీపీ ఎంపీలు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. సత్యవతి మాట్లాడుతూ.. తమ పార్టీకి చెందిన మొత్తం 30 మంది ఎంపీలు ఎన్డీయే రాష్ట్రపతి అభ్యర్థి ద్రౌపది ముర్ముకు ఓటేశామని వెల్లడించారు. దేశం కోసం కృషి చేసిన వ్యక్తులకు సముచిత స్థానం లభిస్తుందనడానికి రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి అభ్యర్థులే నిదర్శనమని ఆమె వ్యాఖ్యానించారు. ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి సామాజిక న్యాయాన్ని చేతల్లో అమలు చేసి చూపుతున్నారని ఈ సందర్భంగా ఆమె గుర్తుచేశారు. సోమవారం నుంచి ప్రారంభమైన పార్లమెంటు వర్షాకాల సమావేశాలను ఉపయోగించుకుని రాష్ట్ర సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్తామన్నారు. అధికార కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జగ్దీప్ ధన్కడ్ నామినేషన్ దాఖలు కార్యక్రమానికి వైఎస్సార్సీపీని ఆహ్వానించకపోవడం 'కమ్యూనికేషన్ గ్యాప్'గా ఎంపీ సత్యవతి వివరించారు.రాజ్యాంగ అత్యున్నత పదవిని ఆదివాసీ మహిళకు ఇవ్వడం తమకు ఆదర్శమని వైఎస్సార్సీపీకి చెందిన అరకు ఎంపీ గొడ్డేటి మాధవి అన్నారు. గిరిజన మహిళను రాష్ట్రపతిని చేయడం సంతోషంగా ఉందని ఆమె వ్యాఖ్యానించారు. ఏపీలో గిరిజనుల అభివృద్ధి కోసం సీఎం జగన్ కృషి చేస్తున్నారని తెలిపారు. జగన్ మహిళా పక్షపాతి అన్నారు. గిరిజన మహిళలకు అవకాశం కల్పిస్తే ఎలా ఉంటారనేదానికి తామే నిదర్శనమని ఆమె వ్యాఖ్యానించారు. జగన్ గర్వపడేలా ముందుకు నడుస్తామని తెలిపారు. గిరిజన మహిళకు రాష్ట్రపతి అభ్యర్థిగా అవకాశం కల్పించినందుకు ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు.

వెనుకబడిన వర్గాల గొంతు వినిపించేందుకు తనను సీఎం జగన్మోహన్ రెడ్డి రాజ్యసభకు పంపించారని సోమవారం ఎంపీగా ప్రమాణస్వీకారం చేసిన బీద మస్తాన్ రావు అన్నారు. పెద్దల సభలో బీసీల గొంతుకై నిలుస్తానని అన్నారు. రాజశేఖర్ రెడ్డికి తగ్గ కొడుకుగా జగన్ ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తున్నారని కొనియాడారు. ఎన్డీఏ రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి అభ్యర్థులకు మద్దతివ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారని, ఆ ప్రకారం రాష్ట్రపతి ఎన్నికల్లో సంతోషంగా పాల్గొన్నామని ఆయన తెలిపారు.

# జర్నలిస్ట్ గాంధీకి నివాళి

**-కుటుంబానికి అండగా ఉంటాం**
**-తక్షణ సాయంగా 10వేలు అందజేత**
**-టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ**




ఖమ్మం, జులై 18: (నేటినిజం ప్రతినిధి): మూడు దశాబ్దాల కాలంగా జర్నలిస్టుగా సమాజాభివృద్ధికి పాటుపడి అతిచిన్న వయస్సులో అకాల మరణం పొందిన సీనియర్ జర్నలిస్ట్ బైరి కరంచంద్ గాంధీకి తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(టీజేఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు ఘన నివాళులర్పించారు. సోమవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో టియుడబ్ల్యూజే ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి, రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు అడపాల నాగేందర్, జిల్లా నాయకులు చిర్రా రవి, విజేత, అమరవరపు కోటేశ్వరావు, నామా పురుషోత్తం, కొమిరె వెంకటేశ్వర్లు, టి.ఎస్ చక్రవర్తి, బండి కుమార్, తదితరులు మాట్లాడుతూ.. జర్నలిస్ట్ గా గాంధీ చర్ల, భద్రాచలం లాంటి ఏజెన్సీ ప్రాంతంలో అధికారులతో కలసి ఆదివాసీ గిరిజనులు, గిరిజనేతరులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ఎంతో కృషిచేశారన్నారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో కూడా ప్రజాతంత్ర గాంధీగా పేరొంది చిన్నా, పెద్ద అనే తారతమ్యాలు లేకుండా జర్నలిస్ట్, రాజకీయ, ప్రజా సమస్యలు పరిష్కరించడంలో జర్నలిస్ట్ గా, న్యాయవాదిగా ఎంతో కృషి చేశారని కొనియాడారు. జర్నలిస్ట్ వృత్తి కత్తి మీద సాములాగా తయారైందని నిరంతరం సమాజంమీదనే కాకుండా తన ఆరోగ్యంతో పాటు కుటుంబంపైన దృష్టి సారించాలని గుర్తు చేశారు. యూనియన్ల కతీతంగా జర్నలిస్ట్ అయితే చాలు ఆపదలో ఉన్నామంటే యూనియన్ ద్వారా అవకాశమున్నంత వరకు సాయం అందించడంతో పాటు అండగా ఉంటామని గాంధీ కుటుంబాన్ని బట్టి గుర్తు చేశారు. గాంధీ కుటుంబానికి ప్రభుత్వ పరంగా రావాల్సిన ఆర్థిక సాయం, పెన్షన్ వచ్చే విదంగా కృషిచేస్తామన్నారు. వృత్తి పరంగా జర్నలిస్టులు సమాజాభివృద్ధికి పాటుపడుతూ మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. జర్నలిస్టులందరూ ఐక్యంగా ఉండి సమస్యల సాధనతో పాటు ఆపదలో ఉన్న జర్నలిస్టులను ఆదుకునే విధంగా ఉండాలన్నారు. అనంతరం గాంధీ కుటుంబ సభ్యులకు తక్షణ సాయంగా పదివేల రూపాయలను అందజేశారు. ఈ సంతాప సభలో జర్నలిస్ట్ నాయకులు రాజేంద్రప్రసాద్, సంతోష్, కొరకొప్పుల రాంబాబు, తిరుపతిరావు, పొనకాల రావు, కోటేశ్వరావు, యాదగిరి, శ్రీనివాస్, రామారావు, గోపి, కట్టెకోల చిన్న నరసయ్య, నాగేశ్వరావు, వెంకటరెడ్డి, జీవన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, గణేష్, మోహన్, పాషా, నరేష్, ఆర్కె, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# వరద రాజకీయం చేయడానికి చంద్రబాబు పర్యటన : అంబటి రాంబాబు

అమరావతి, జులై 18: టీడీపీ నాయకులకు ప్రతీది రాజకీయం చేయడం అలవాటుగా మారిందని ఏపీ మంత్రి అంబటి రాంబాబు దుయ్యబట్టారు. గోదావరి వరద ప్రభావాన్ని కూడా వ్యక్తిగత స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం చంద్రబాబు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించనున్నారని ఆరోపించారు . ఇవాళ ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు.

గోదావరికి 36 సంవత్సరాల తరువాత జులై నెలలో వరదలు రావడం ఇదే ప్రథమమని అన్నారు. అయితే వరద ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకోవడం వల్లే ప్రాణ నష్టం జరుగలేదని తెలిపారు. వరద బాధితులను పునరావస కేంద్రాలకు పంపించిన ప్రభుత్వం సహాయ కార్యక్రమాలను అందిస్తుందని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు పై మాజీ మంత్రి దేవినేని ఉమ మాట్లాడడం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని అన్నారు.

కాపర్ డ్యామ్ పూర్తి చేయకుండా డయాఫ్రమ్ వాల్ పూర్తి చేస్తారా అని ప్రశ్నించారు. ప్రాజెక్టులపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు.

# కృష్ణా నదికి పెరిగిన వరద.. జూరాల నుంచి శ్రీశైలం పరుగెడుతున్న కృష్ణమ్మ!

అమరావతి, జులై 18: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి నదికి పెద్ద ఎత్తున వరదలు రాగా, ఇటు కృష్ణా నదికి కూడా వరద పోటెత్తుతోంది. దీంతో నారాయణపూర్? జలాశయం నుంచి జూరాలకు 1.38 లక్షల నీరు విడుదల అవుతోంది. జూరాలకు ఇప్పటి వరకు 1.65 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. దీంతో జూరాల ప్రాజెక్టు 23 గేట్లు ఓపెన్? చేసి దిగువకు 1.36 లక్షల క్యూసెక్కులు రిలీజ్? చేస్తున్నారు. ఇక.. తుంగభద్ర నుంచి శ్రీశైలానికి 1.48లక్షల క్యూసెక్కులు, జూరాల నుంచి 1.36 లక్షల క్యూసెక్కుల ప్రవాహం చేరుతోంది. దీంతో శ్రీశైలం ప్రాజెక్టులోకి మొత్తంగా 3.11లక్షల ఇన్?ఫ్లో వస్తున్నట్టు తెలుస్తోంది.

పాలమూరు జిల్లాలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరద ఉధృతి కాస్త పెరిగినట్లు ప్రాజెక్టు అధికారులు వెల్లడించారు. సోమవారం సాయంత్రం 6 గంటల వరకు ప్రాజెక్టుకు 1.65లక్షల క్యూసెక్కుల ఇన్?ఫ్లో ఉంది. 23 గేట్లు ఓపెన్? చేసి స్పిల్? వే ద్వారా 1.36 లక్షల క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. పవర్? హౌజ్?కు 34,392 క్యూసెక్కులు రిలీజ్? చేస్తున్నారు. అదే విధంగా నెట్టెంపాడు లిఫ్ట్?కు 1500, భీమా లిఫ్ట్?కు 1300, లెఫ్ట్? మెయిన్? కెనాల్ (?ఒఓఅ) ద్వారా 920, రైట్? మెయిన్? కెనాల్ (ఖీఓఅ)? ద్వారా 210, ప్యారలాల్? కెనాల్? (ఖజీతీజీశ్రీశ్రీవశ్రీ ఇజీనిజీశ్రీ ) ద్వారా 500 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇక.. ఆవిరి రూపంలో (ఇలజీజూనీతీజీబితినీని) మరో 67 క్యూసెక్కుల లాస్? ఉంది. జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 8.029 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 4. 322 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా, మొత్తం ప్రాజెక్టు నుంచి అవుట్? ఫ్లో 1,75,687 క్యూసెక్కులున్నట్టు అధికారులు తెలిపారు.

ఇక.. శ్రీశైలం జలాశయానికి వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది. జలాశయంలో నీటి మట్టం క్రమక్రమంగా పెరుగుతోంది. జూరాల ప్రాజెక్టు నుంచి 34 వేల 392 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం ప్రాజెక్టుకు చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 867.50 అడుగులున్నట్లు అధికారులు తెలిపారు. 215 టీఎంసీల సామర్థ్యానికి గాను, 131.85 టీఎంసీల నీరు నిల్వ ఉంది.. కాగా, తుంగభద్ర, జూరాల ప్రాజెక్టుల నుంచి శ్రీశైలం జలాశయానికి 3లక్షల11వేల 448 క్యూసెక్కులు ఇన్ ఫ్లో వస్తోంది.



# గాయపడ్డ గీత కార్మికుడికి ఆర్థిక సాయం



రాజన్న సిరిసిల్ల, జులై 18 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లికి చెందిన గీతా వృత్తి దారుడు బాలసాని నర్సయ్య గౌడ్ ప్రమాదవశాత్తు తాటి చెట్టు మిదికెళ్ళి పడి తీవ్ర గాయాలయ్యాయి. అతడికి హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం 15000 వేలను బీసీ సంక్షేమశాఖ ప్రిన్సిపాల్ కార్యదర్శి, తాడి కార్పొరేషన్ చైర్మన్ బుర్ర వెంకటేశంలు ప్రభుత్వం ద్వారా ఖర్చులకు రూ.15000 వేలు మంజూరు చేశారు. కాగా బాధిత కుటుంబానికి బీసీ సంక్షేమ శాఖ అధికారులు మోహన్ రెడ్డి, సంపూర్ణ, సర్వాయిపాపన్న మోకుదెబ్బ గౌడ సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తీగల శ్రావణ్ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు నాగుల రాము గౌడ్, గుమ్మడి రాజశేఖర్ గౌడ్, వేములవాడ మండల యూత్ అధ్యక్షుడు తీగల హరిష్ గౌడ్ ,శాత్రాజుపల్లి గౌడ సంఘం అధ్యక్షుడు నాగుల శంకర్ గౌడ్, ఉపాధ్యక్షుడు విక్కుర్తి మధు గౌడ్, ప్రధాన కార్యదర్శి విక్కుర్తి శ్రీనివాస్ గౌడ్, క్యాషియర్ విక్కుర్తి సాయి బాబు గౌడ్ ల చేతుల మీదుగా సోమవారం చెక్కును అందజేశారు. తాటి చెట్టు పై నుండి పడిన వెంటనే సర్వాయిపాపన్న మోకుదెబ్బ గౌడ సంక్షేమ సంఘము రాష్ట్ర నాయకులు జాగిరి అంజి గౌడ్ కు సమాచారం అందించగా వారు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించి ఆర్థిక సహాయం ప్రభుత్వం ద్వారా అందించిన బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ అండ్ తాడి కార్పొరేషన్ చైర్మన్ బుర్ర వెంకటేశం తాడి కార్పొరేషన్ ఎండి ఉదయ్ ప్రకాష్, జూనియర్ అసిస్టెంట్ పాముకుంట్ల రవిందర్ గౌడ్ లకు, సర్వాయిపాపన్న మోకుదెబ్బ గౌడ సంక్షేమ సంఘము నాయకులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# కళాకారుడు మారం ప్రవీణ్

## -కుమార్ కు జాతీయ మహానంది పురస్కారం



రాజన్న సిరిసిల్ల, జులై 18 (నేటినిజం ప్రతినిధి): వేములవాడలో తెలుగు వెలుగు సాహితి స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ మహానంది పురస్కారాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన నృత్య కళాకారుడు మారం ప్రవీణ్ కుమార్ (పప్పీ) జాతీయ మహానంది అవార్డుని చొప్పదండి ఎమ్మెల్యే సుంకే రవిశంకర్, డిఎస్పీ నాగేంద్ర చారి, రాష్ట్ర మున్నూరు కాపు అధ్యక్షులు కొండ దేవయ్య, కౌన్సిలర్లు మారం కుమార్ వంగాల దివ్య శ్రీనివాస్ ల చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా ఈ ప్రాంత కళాకారుడిగా ఎన్నో వైవిధ్యమైనటువంటి పాత్రలు పోషిస్తూ తనదైన శైలిలో ప్రజల మన్ననలను పొందుతున్న మారం ప్రవీణ్ కుమార్ ను అభినందించారు. అనంతరం మారం ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఇంతగా ప్రోత్సహిస్తున్నటువంటి ఈ కార్యక్రమములో తనతో పాటు కూడా ప్రముఖ గాయకులు, రచయిత సై టీవీ అధినేత మాట్ల తిరుపతిని కూడా జాతీయ మహానంది అవార్డును ప్రధానం చేసినందుకు తెలుగు వెలుగు సాహితీ సంస్థ వారికి, అతిథులకు కళాభివందనాలు తెలియజేశారు.

# పదవి విరమణ పొందిన హోంగార్డుకు ఘన సన్మానం



రాజన్న సిరిసిల్ల, జులై 18 (నేటినిజం ప్రతినిధి): సిరిసిల్లకు చెందిన పోలీస్ హోమ్ గార్డ్ ఎస్కే భాషా పదవి విరమణ సందర్భంగా ఆదివారం పలువురు ఘనంగా సన్మానించారు. నూర్ బాషా సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ఎండి పీర్ మహ్మద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో పోలీస్ హోమ్ గార్డ్ ఎస్కే భాషాను పూలమాలలు శాలువాలతో సత్కరించారు. విధి నిర్వహణలోపోలీస్ హోమ్ గార్డ్ ఎస్కే భాషా ప్రజలకు అందించిన సేవలను కొనియాడారు. భాషాను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గఫూర్ బాయ్, అంకుస్ బాయ్, ఎండి రఫీ, ఎండి అన్వర్, ఎండి షాదుల్లా, వలిమహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# పోలవరంతో తెలంగాణకు ముప్పు, బ్యాక్ వాటర్ ఎగతన్నడంతోనే వరదపోటు.. హెచ్చరిస్తున్న నిపుణులు

అమరావతి, జులై 18: గోదావరి నదికి గతంలో ఎన్నడూ లేని విధంగా వరదలు రావడం ఒక ఎత్తైతే.. తెలంగాణకు దిగువన ఉన్న పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల కూడా భద్రాచలం వద్ద నీటి తాకిడి పెరిగిందని పరిశీలకులు చెబుతున్నారు. పలువురు ఇంజినీర్లు, నీటి రంగంపై అవగాహన ఉన్న నిపుణులు కూడా ఇదే విషయం స్పష్టం చేస్తుండగా తాజాగా తెలంగాణ జలవనరుల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వీరమల్ల ప్రకాశ్ కూడా సంచలన వ్యాఖ్యలు చేశారు.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి అయితే.. భద్రాచలం, బూర్గంపహాడ్ గ్రామం పూర్తిగా మునిగిపోతుందని ప్రకాశ్ అన్నారు. 67అడుగుల ఎత్తులో వరద ప్రవాహం కొనసాగితేనే రామాలయం వెళ్లేందుకు వీలు లేకుడా అష్టదిగ్బంధనం అయ్యిందని, అదే పోలవరం ప్రాజెక్టు కనుక పూర్తయితే ఆ ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ కారణంగా భద్రాచలం పూర్తిగా మునిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పోలవరం విషయంలో సరైన అధ్యయనాలు జరగలేదని, ముఖ్యంగా బ్యాక్ వాటర్, డ్యామ్ సేఫ్టీ విషయంలో సరైన స్టడీస్ చేయకుండానే నిర్మాణ పనులు మొదలు పెట్టారని అన్నారు. ఈ అంశాలను అధ్యయనం చేసేందుకు అప్పటి సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబు నిరాకరించారని ప్రకాశ్ ఆరోపించారు.

# ప్రధానమంత్రి యుపి సందర్శన-బుందేల్ ఖండ్ ఎక్స్ ప్రెస్ వే ప్రారంభం

న్యూఢిల్లీ, జులై 18: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ బుందేల్ ఖండ్ ఎక్స్ వేను ఉత్తర ప్రదేశ్ లో జలౌన్ జిల్లాలోని ఒరాయ్ తహసీల్ కు చెందిన కేథేరి గ్రామం వద్ద ప్రారంభించారు. ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ యోగి ఆదిత్య నాథ్, రాష్ట్ర మంత్రులు, ప్రజా ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిలో ఉన్నారు.

ఈ సందర్భంగా అక్కడ హాజరైన ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ బుందేల్ ఖండ్ ప్రజల శ్రమించి పని చేసే స్వభావం, సాహసం, సాంస్కృతిక ఔన్నత్యం గురించి ప్రధానమంత్రి గుర్తు చేశారు. "ఈ భూమి ఎందరో పోరాట యోధులను తయారుచేసింది. ఈ ప్రాంతంలోని ప్రజల రక్తంలో దేశం పట్ల అంకిత భావం పొంగి పొరలుతూ ఉ ంటుంది. ఈ ప్రాంతానికి చెందిన కుమారులు, కుమార్తెల శక్తి, శ్రమించే స్వభావం ఎప్పుడూ దేశానికి కాంతులు నింపుతూనే ఉన్నాయి" అన్నారు.

కొత్త ఎక్స్ ప్రెస్ వే అందించే తేడా గురించి వివరిస్తూ "ఇది చిత్రకూట్-ఢిల్లీ మధ్య దూరాన్ని 3-4 గంటల మేరకు తగ్గిస్తుంది, కాని అది అందించే లాభం అంతకన్నా ఎంతో అధికంగా ఉంటుంది. ఈ ఎక్స్ ప్రెస్ వే ఈ ప్రాంతం మీదుగా నడిచే వాహనాల వేగం పెంచడమే కాదు, బుందేల్ ఖండ్ ప్రాంత పారిశ్రామికాభివృద్ధిని కూడా వేగవంతం చేస్తుంది" అన్నారు.

భారీ మౌలిక వసతులు, సౌకర్యాలు పెద్ద నగరాలు, దేశంలోని ఎంపిక చేసిన ప్రాంతాలకే పరిమితం అనే రోజులు పోయాయి, సబ్ కా సాత్ సబ్ కా వికాస్ స్ఫూర్తితో ఇప్పుడు మారుమూల ప్రాంతాలు, నిర్లక్ష్యానికి గురైన ప్రదేశాలు కూడా కనివిని ఎరుగని కనెక్టివిటీ పొందుతున్నాయి అని ప్రధానమంత్రి అన్నారు. ఈ ఎక్స్ ప్రెస్ వేతో ఈ ప్రాంతంలో అభివృద్ధి, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలెన్నో అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ఉత్తర ప్రదేశ్ లోని కనెక్టివిటీ ప్రాజెక్టులు గతంలో నిర్లక్ష్యం చేసిన పలు ప్రాంతాలకు అనుసంధానత కల్పిస్తున్నాయని తెలిపారు. ఉదాహరణకి బుందేల్ ఖండ్ ఎక్స్ ప్రెస్ వేని తీసుకుంటే ఇది చిత్రకూట్, బంగా, మహోబా, హమీర్ పూర్, జలౌన్, ఔరియా, ఎటావా జిల్లాల ద్వారా సాగుతుందన్నారు. ఎక్స్ ప్రెస్ వేలు రాష్ట్రంలోని ప్రతీ ఒక్క మూలను కలుపుతున్నాయంటూ "ఉత్తర ప్రదేశ్ లోని ప్రతీ ఒక్క మారుమూల ప్రాంతం కొత్త కలలు, కొత్త సంకల్పాలతో ముందుకు సాగేందుకు సిద్ధంగా ఉంది అని చెప్పారు. ఈ డబుల్ ఇంజన్ సర్కారు పునరుజ్జీవించిన శక్తితో ఆ దిశలో పయనిస్తోంది" అన్నారు.

రాష్ట్రంలో వైమానిక అనుసంధానత మెరుగుపరిచే చర్యల గురించి ప్రస్తావిస్తూ ప్రయాగ్ రాజ్, కుశినగర్ లలో కొత్త ఎయిర్ పోర్టు టెర్మినల్స్ అందుబాటులోకి వచ్చాయని, నోయిడాలోని జెవార్ ప్రాంతంలో కొత్త విమానాశ్రయ నిర్మాణం పనులు చురుగ్గా సాగుతున్నాయని, ఇంక ఎన్నో నగరాలకు విమానయాన అనుసంధాన సౌకర్యం ఏర్పడనున్నదని చెప్పారు. ఇది టూరిజం, ఇతర అభివృద్ధి అవకాశాలు అందిస్తుందన్నారు.

ఈ ప్రాంతంలోని పలు కోటల చుట్టూ పర్యాటక ప్రాంతాలు అభివృద్ధి చేయాలని, కోటలకు సంబంధించిన వేడుకలు ఏర్పాటు చేయాలని, పోటీలు నిర్వహించాలని ముఖ్యమంత్రికి ప్రధానమంత్రి సూచించారు.

ఒకప్పటి యుపిలో సరయు కాల్వ ప్రాజెక్టు పూర్తి కావడానికి 40 సంవత్సరాలు పట్టింది, గోరఖ్ పూర్ ఎరువుల ఫ్యాక్టరీ 30 సంవత్సరాల పాటు మూతబడింది, అర్జున్ డామ్ ప్రాజెక్టు పూర్తి కావడానికి 12 సంవత్సరాలు పట్టింది, అమేథి రైఫిల్ ఫా?యక్టరీ కేవలం ఒక బోర్డుతోనే మూలన పడి ఉంది, రాయబరేలి రైల్ కోచ్ ఫ్యాక్టరీ కేవలం రైలు కోచ్ లకు రంగులు వేసే పనికే పరిమితం కావలసివచ్చింది అని ప్రధానమంత్రి విమర్శించారు. కాని ఇప్పుడు ఎన్నో అభివృద్ధి చెందిన రాష్ట్రాల కన్నా మెరుగైన పనితీరు ప్రదర్శించే విధంగా యుపిలో మౌలిక వసతుల అభివృద్ధి జరుగుతోంది, దేశవ్యాప్తంగా యుపి ఇమేజ్ మారుతోంది అని ప్రధానమంత్రి అన్నారు.

పరిపాలనలో వేగం గురించి శ్రీ మోదీ ప్రస్తావిస్తూ గతంలో ఏడాదికి 50 కిలోమీటర్ల రైల్వేలైన్ నిర్మాణం జరిగేదని, ఇప్పుడది 200 కిలోమీటర్లకు పెరగడమే ఇందుకు తార్కాణమని చెప్పారు. అలాగే ఉత్తర ప్రదేశ్ లోని కామన్ సర్వీస్ కేంద్రాల సంఖ్య 2014లో 11,000 ఉండగా ఇప్పుడది 1.30 లక్షలకు చేరిందని తెలిపారు. అలాగే రాష్ట్రంలో వైద్య కళాశాలల సంఖ్య 12 నుంచి 35కి పెరిగిందని, మరో 14 వైద్య కళాశాలలు నిర్మాణంలో ఉన్నాయని అన్నారు.

నేడు జరుగుతున్న అభివృద్ధి క్రమానికి రెండు ప్రధాన కోణాలున్నాయంటూ అవే ఇరాదా, మర్యాద (ఉద్దేశం, మర్యాద) అని ప్రధానమంత్రి చెప్పారు. తాము దేశానికి వర్తమానానికి అవసరం అయిన కొత్త సదుపాయాలు కల్పించడమే కాదు, భవిష్యత్తుకు కూడా సదుపాయాలు అందిస్తున్నట్టు తెలిపారు. ఉత్తర ప్రదేశ్ లో పూర్తవుతున్న ప్రాజెక్టులు పూర్తిగా "మర్యాద"కు (గడువు) లోబడినవేనన్నారు. ఇందుకు చక్కని ఉదాహరణ బాబా విశ్వనాథ్ ధామ్ పునర్నిర్మాణం, గోరఖ్ పూర్ ఎయిమ్స్, ఢిల్లీ-మీరట్ ఎక్స్ ప్రెస్ వే, బుందేల్ ఖండ్ ఎక్స్ ప్రెస్ వేలని ఆయన తెలిపారు. సకాలంలో ప్రాజెక్టులు పూర్తి చేయడం ద్వారా ప్రజా తీర్పును, వారు తమపై ఉంచిన విశ్వాసాన్ని తాము గౌరవిస్తున్నట్టు శ్రీ మోదీ చెప్పారు. రాబోయే స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన ప్రజలను కోరారు. మనం స్వాతంత్ర్య సమర యోధులను ఎప్పుడూ గుర్తుంచుకోవాలి, రాబోయే ఒక నెల రోజుల కాలంలో కొత్త సంకల్పాలకు అనుకూలమైన వాతావరణం కల్పించుకోవాలని ఆయన సూచించారు.

ఏ నిర్ణయం లేదా ఏ విధానం ప్రధాన లక్ష్యం అయినా దేశాభివృద్ధిని మరింత వేగవంతం చేయడమే కావాలని ప్రధానమంత్రి అన్నారు. దేశానికి హానికరమైనది ఏదైనా అభివృద్ధిని కుంటుపరుస్తుందని, అలాంటి వైఖరిని మనం విడనాడాలని ఆయన సూచించారు. "అమృతకాలం" అత్యంత అరుదైన అవకాశమని, దేశాభివృద్ధి కోసం లభించిన ఈ అవకాశాన్ని మనం చేజార్చుకోకూడదని చెప్పారు.

ఉచితాలు ప్రకటించి ఓట్లు అభ్యర్థించే సంస్కృతి అత్యంత ప్రమాదకరమని ప్రధానమంత్రి హెచ్చరించారు. ఈ ఉచితాల సంస్కృతి విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. ఈ ఉచితాల సంస్కృతి మీకు కొత్త ఎక్స్ ప్రెస్ వేలు లేదా కొత్త రక్షణ కారిడార్లు అందుబాటులోకి తీసుకురాలేకపోయిందని ఆయన గుర్తు చేశారు. సగటు మనిషికి ఉచితాలు అందించడం ద్వారా తాము ఓట్లు దండుకోవచ్చునని ఈ ఉచితాల సంస్కృతికి అలవాటు పడిన వారు భావిస్తారని ఆయన చెప్పారు. సామూహికంగా ఈ ఆలోచనను ఓడించాలని, దేశ రాజకీయాల నుంచి ఉచితాల సంస్కృతిని తొలగించాలని ఆయన పిలుపు ఇచ్చారు. నేటి ప్రభుత్వం ఈ ఉచితాల సంస్కృతిని దూరంగా పెట్టి ప్రజలకు పక్కా గృహాలు, రోడ్లు, మౌలిక వసతులు, ఇరిగేషన్, విద్యుత్ ప్రాజెక్టులు అందించడంపై దృష్టి పెట్టిందని చెప్పారు. "డబుల్ ఇంజన్ ప్రభుత్వాలు ఉచితాలనే దగ్గర దారులు వదిలి కష్టించి పని చేయడం ద్వారా ఫలితాలు చూపిస్తున్నాయి" అన్నారు.

దేశంలో నెలకొన్న సమతూకమైన అభివృద్ధి గురించి మాట్లాడుతూ ఇప్పుడు అభివృద్ధి నిర్లక్ష్యానికి గురైన, చిన్న నగరాలకు విస్తరించిందని, అది సామాజిక న్యాయాన్ని అందిస్తున్నదని ప్రధానమంత్రి చెప్పారు. ఆధునిక మౌలిక వసతులు నిర్లక్ష్యానికి గురైన తూర్పు భారతానికి, బుందేల్ ఖండ్ ప్రాంతానికి చేరాయని, అది కూడా సామాజిక న్యాయానికి దారి తీసిందని తెలిపారు. అభివృద్ధి క్రమంలో భాగస్వాములు కాని వెనుకబడిన జిల్లాలు కూడా ఇప్పుడు అభివృద్ధికి నోచుకుంటున్నాయంటూ ఇది కూడా సామాజిక న్యాయమని చెప్పారు. పేదలకు మరుగుదొడ్లు, గ్రామాలకు రోడ్లు, టాప్ ల ద్వారా నీటి వసతి సామాజిక న్యాయమని తెలిపారు. బుందేల్ ఖండ్ ఎదుర్కొంటున్న మరో సవాలును కూడా పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్టు ప్రధానమంత్రి చెప్పారు. ప్రతీ ఒక్క ఇంటికీ కుళాయిల ద్వారా నీరందించేందుకు ప్రారంభించిన జల్ జీవన్ కార్యక్రమం గురించి ప్రధానమంత్రి వివరించారు.

బుందేల్ ఖండ్ నదుల్లోని నీటికి అధిక శాతం మంది ప్రజలకు అందించేందుకు చేపట్టిన రతౌని డామ్, భవాని డామ్, మజగాం-చిల్లీ స్ప్రింక్లర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల గురించి ప్రధానమంత్రి ప్రస్తావించారు.అలాగే కెన్-బెత్వా లింక్ ప్రాజెక్టు ఈ ప్రాంతంలోని ప్రజల జీవితాన్ని మారుస్తుందన్నారు.

ప్రతీ జిల్లాలోనూ 75 అమృత సరోవరాలు ఏర్పాటు చేసే కృషికి బుందేల్ ఖండ్ ప్రజలు కూడా తమ వంతు కృషి చేయాలన్న అభ్యర్థన ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు.

చిన్నతరహా, కుటీర పరిశ్రమలను పటిష్ఠం చేయడానికి చేపట్టిన మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం గురించి ప్రస్తావిస్తూ ఆటబొమ్మల పరిశ్రమ విజయం ఇందుకు తార్కాణమని ప్రధానమంత్రి నొక్కి చెప్పారు. ప్రభుత్వం, హస్త కళాకారులు, పరిశ్రమ, పౌరుల కృషితో ఆటబొమ్మల దిగుమతి గణనీయంగా తగ్గిందని ఆయన చెప్పారు. దీని వల్ల పేదలు, నిరాదరణకు గురవుతున్న వారు, వెనుకబడిన తరగతులు, గిరిజనులు, దళితులు, మహిళలు లబ్ధి పొందుతారన్నారు.

క్రీడారంగానికి బుందేల్ ఖండ్ అందించిన సేవల గురించి ప్రధానమంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ ప్రాంతం పుత్రుడు మేజర్ ధ్యాన్ చంద్ పేరిటనే దేశంలో అత్యున్నత క్రీడా పురస్కారం ఉన్నదన్న విషయం గుర్తు చేశారు. అలాగే ఈ ప్రాంతానికి చెందిన అంతర్జాతీయ అథ్లెట్ అండర్-20 వరల్డ్ అథ్లెటిక్ చాంపియన్ షిప్ లో దేశానికి ప్రశంసలు తెచ్చి పెట్టిన విషయం ప్రస్తావించారు.

దేశవ్యాప్తంగా కనెక్టివిటీ పెంచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. రోడ్డు మౌలిక వసతుల మెరుగుదల ఇందులో ప్రధానం. 2020 ఫిబ్రవరి 29వ తేదీన బుందేల్ ఖండ్ ఎక్స్ ప్రెస్ వేకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేయడం ఈ దిశగా ప్రధానమైన చర్య. ఈ ప్రాజెక్టు 28 నెలల కాలపరిమితిలో పూర్తి కావడమే నవభారతంలో ప్రాజెక్టులు సకాలంలో పూర్తి చేయడానికి ప్రభుత్వం చేస్తున్న కృషికి నిదర్శనం.

ఉత్తర ప్రదేశ్ ఎక్స్ ప్రెస్ వేస్ పారిశ్రామికాభివృద్ధి సంస్థ (ఉపెడా) ఆధ్వర్యంలో రూ.14,850 కోట్ల వ్యయంతో చేపట్టిన 296 కిలోమీటర్ల నిడివి గల నాలుగు లేన్ల ఈ బుందేల్ ఖండ్ ఎక్స్ ప్రెస్ వేను తదుపరి కాలంలో అవసరాలకు అనుగుణంగా ఆరు లేన్లుగా విస్తరించుకునే అవకాశం కూడా ఉంది. చిత్రకూట్ జిల్లాలోని భరత్ కూప్ వద్ద గోండా గ్రామం దగ్గర ఎన్ హెచ్-5లో ప్రారంభమయ్యే ఈ ఎక్స్ ప్రెస్ వే ఎటావా జిల్లాలోని కుద్రేల్ గ్రామం వద్ద ఆగ్రా-లక్నో ఎక్స్ ప్రెస్ వేలో కలుస్తుంది. ఇది చిత్రకూట్, బందా, మహోబా, హమీర్ పూర్, జలౌన్, ఔరియా, ఎటావా జిల్లాల మీదుగా సాగుతుంది.

బుందేల్ ఖండ్ ఎక్స్ ప్రెస్ వే ఈ ప్రాంతంలో అనుసంధానత పెంచడంతో పాటు ఆర్థికాభివృద్ధికి భారీ ఉత్తేజం అందిస్తుంది. తద్వారా స్థానిక ప్రజలకు వేలాది ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. ఎక్స్ ప్రెస్ వే వెంబడి బందా, జలౌన్ జిల్లాల్లో పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు పనులు కూడా ఇప్పటికే ప్రారంభమయింది.

# విద్యాసంస్థలు, వసతి గృహాల స్థితిగతులపై రిపోర్ట్ అందజేయాలి

## - జిల్లా కలెక్టర్ ఆదేశం అనురాగ్ జయంతి



రాజన్న సిరిసిల్ల, జులై 18 (నేటినిజం ప్రతినిధి): ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలు కురుస్తుండడం, రానున్న రోజుల్లో కూడా సాధారణం కు మించి వర్షాలు కురుస్తాయన్న సూచనల నేపథ్యంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హై అలర్ట్ గా ఉండాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు.

జిల్లాలోని సంక్షేమ , విద్యా శాఖ లు సహా అన్ని ప్రభుత్వ శాఖలు

ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, అంగన్వాడి, వసతి గృహాల స్ట్రక్చర్, క్షేత్ర కార్యాలయ భవనాల పరిస్థితి పరిశీలించి నేటి ( 19 వ తేదీ) కల్లా రిపోర్ట్ అందజేయాలనీ జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.సోమవారం ప్రజావాణిని పురస్కరించుకొని కాన్ఫరెన్స్ హాల్ లో ప్రజల నుంచి ఫిర్యాదులు వినతులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు.జిల్లాలో ఇప్పటివరకు కురవాల్సిన వర్షపాతం సాధారణ వర్షపాతం కంటే 120 శాతం అధికంగా వర్షపాతం నమోదయింది అన్నారు.

ఆగస్ట్, సెప్టెంబర్, అక్టోబరు మాసంలో కూడ వర్షపాతం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖలు తమ పరిధిలోని ప్రభుత్వ క్షేత్ర కార్యాలయాలు, వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో పాత స్ట్రక్చర్లు ఇప్పటికే కురిసిన భారీ వర్షాలకు బలహీనమయే అవకాశం ఉందన్నారు. తద్వారా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ప్రమాదం వాటిల్లే ప్రమాదం ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు .అన్ని ప్రభుత్వ శాఖల సంక్షేమ శాఖల అధికారులు సంబంధిత ఆర్సీఓలను సమన్వయం చేసుకుంటూ తమ పరిధిలోని ప్రతి స్ట్రక్చర్ నిశితంగా వెరిఫై చేయాలన్నారు. ప్రతి స్ట్రక్చర్ సురక్షితమా కాదా అని తేల్చి సంబంధిత రిపోర్టును తనకు అందజేయాలన్నారు.

మంగళవారం డ్రై డే కార్యక్రమం ఉన్నందున అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, వాటి పరిధిలో పనిచేసే క్షేత్ర కార్యాలయాలు, విద్యాసంస్థల్లో తప్పనిసరిగా డ్రై డే కార్యక్రమాన్ని చేపట్టి కార్యాలయాలు పాఠశాలలు వాటి పరిసరాలు పరిశుభ్రంగా ఉ ంచుకోవలసిన బాధ్యత సంబంధిత జిల్లా అధికారులు క్షేత్ర అధికారులకు ఉందన్నారు ఆ దిశగా వెంటనే క్షేత్ర సిబ్బందికి ఆదేశాలు జారీ చేయాలన్నారు. డ్రై డే వల్ల దోమల వృద్ధిని అరికట్టవచ్చునని తెలిపారు. అలాగే కొత్త పంచాయతీ రాజ్ చట్టం, మున్సిపల్ చట్టం ప్రకారం తమ పరిధిలోని శిథిలావస్థకు చేరుకున్న భవనాలను నిర్మాణాలను ప్రజా భద్రత దృష్ట్యా తొలగించే బాధ్యతను కమిషనర్లు, సెక్రెటరీ ల దేనని చట్టంలో స్పష్టంగా స్పష్టం చేయడం జరిగిందన్నారు.

ఫీల్డ్ నెట్వర్క్ ను అప్రమత్తం చేసుకుంటూ వెంటనే శిథిలావస్థకు చేరుకొని కూలేందుకు సిద్ధంగా ఉన్న భవనాలను, నిర్మాణాలను వెంటనే నేలమట్టం చేయాలని జిల్లా కలెక్టర్ మున్సిపల్, పంచాయితీ రాజ్ అధికారులకు సూచించారు. ఇంటర్మీడియట్ జిల్లా అధికారి ,జిల్లా విద్యాధికారులు తమ పరిధిలోని పాఠశాలలో బలహీనమైన స్ట్రక్చర్లను కిచెన్ షెల్టర్ టాయిలెట్స్ తరగతి గదులను స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్,ప్రధానోపాధ్యాయులను సమన్వయం చేసుకుంటూ గుర్తించి భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. బలహీన స్ట్రక్చర్ లను కూల్చి వేయాలన్నారు.ఈ విషయంలో అలక్ష్యాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూసహించబోమని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైద్యారోగ్య శాఖ అధికారులు కూడా తమ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఉప ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేసి స్ట్రక్చర్ల నిర్మాణాల పరిస్థితి పై రిపోర్ట్ అందజేయాలన్నారు.

మండల ప్రత్యేక అధికారులు తమ మండలాల పరిధిలో డ్రైడే జరుగుతున్న తీరును పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అలాగే పంచాయతీల పనితీరును పర్యవేక్షణ చేసే బాధ్యతను కూడా ప్రత్యేక అధికారులు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ,ప్రజలు విష జ్వరాల బారిన పడకుండా ఉండేందుకు అన్నిమున్సిపాలిటీలు,గ్రామపంచాయతీలో నిరంతరం పారిశుద్ధ కార్యక్రమాలు ప్రభావంతంగా అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత ప్రత్యేక అధికారుల దేనిని స్పష్టం చేశారు. అలాగే జిల్లాలో ప్రమాదకర ఓపెన్ డ్రైన్ లు, మ్యాన్ హోల్ లను గుర్తించి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్లను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.వర్షాలనేపథ్యంలో త్రాగునీటి సరఫరా వ్యవస్థలో అక్కడక్కడ ఏర్పడే లీకేజీల వల్ల త్రాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉన్నందున ప్రజలకు సురక్షిత త్రాగునీరు సరఫరా అయ్యేలా చూడాల్సిన బాధ్యత మిషన్ భగీరథ అధికారుల దేనిని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

### దెబ్బతిన్న అన్ని రోడ్లకు మరమ్మత్తులు చేపడుతాం:

జిల్లాలో భారీ వర్షాలకు దెబ్బతిన్న, కోత కు గురైన అర్ అండ్ బి, పంచాయితీ రాజ్ రోడ్లకు సాధ్యమైనంత త్వరగా మరమ్మత్తులు చేపడుతామని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. ఆదిశగా చర్యలు చేపట్టాలనీ ఇంజనీరింగ్ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఆర్డీఓ లీల తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కోర్టును సందర్శించిన అల్ఫోర్స్ ఇ - టెక్నో స్కూల్ విద్యార్థులు



కరీంనగర్ , జులై 18: (నేటినిజం ప్రతినిధి): స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ - టెక్నో పాఠశాలలో 6 , 7 వ తరగతి విద్యార్థులు జిల్లా కోర్టు ను సందర్శించారు .ఈ సందర్భంగా బయలుదేరే ముందు విద్యార్థులతో అల్ఫోర్స్ సంస్థల అధినేత డాక్టర్ .నరేందర్రెడ్డిముచ్చటించి , న్యాయ శాస్త్ర ప్రాముఖ్యతను వర్ణించి దాని ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేశారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయం ద్వారా శాంతి కలుగుతుందని మరియు పలు సమస్యలకు , అంశాలకు న్యాయమే ఆధారమని , అభివృద్ధి భాటన పయనించే విధంగా తోడ్పాటునందిస్తుందని వారు చెప్పారు . నేడు చాలా మంది న్యాయం లేకసతమతవుతున్నారని మరియు సమస్యలు పరిష్కారం కాకుండ ఉండటంతో అభివృద్ధి కుంటపడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు . ప్రపంచంలో న్యాయ శాస్త్రం చాలా ప్రాముఖ్యమైన పాత్రను పోషిస్తున్నదని మరియు ప్రగతి బాటన పయనించేటట్టుగా చేయూతనిస్తుందని అభిప్రాయపడ్డారు . ప్రతి సంవత్సరం జులై 17 ను అంతర్జాతీయ న్యాయదినోత్సవంగా నిర్వహించుకుంటారని మరియు పెండింగ్లో ఉన్న పలు కేసులు పరిష్కారిస్తారని చెప్పారు . విద్యార్థులకు న్యాయ వ్యవస్థ పట్ల అవగాహన కల్పించడానికై మరియు న్యాయవాదులు వ్యవహరిస్తున్న తీరును మరియు అందించే తోడ్పాటును విద్యార్థులకు ప్రత్యక్షంగా తెలియజేయడానికై పాఠశాలలోని 6 మరియు 7 వ తరగతి విద్యార్థులను జిల్లా కేంద్రంలోని కోర్టుకు తీసుకవెల్లడం జరిగినదని వారు చెప్పారు . ఈ సందర్శనలో భాగంగా విద్యార్థులు కోర్టు ఆవరణలో పలువురు న్యాయవాదులకు అంతర్జాతీయ న్యాయ దినోత్సవ శు భాకాంక్షలు తెలియజేసి వారి ఆనందాన్ని రెట్టింపు చేసుకున్నారు . సందర్శనలో భాగంగా ప్రముఖ న్యాయవాది మరియు అడిషినల్ పబ్లిక్ ప్రాస్యుకూటర్ కనుకుల సంజీవ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాథమిక దశనుండే అవగాహన కల్పించాలని మరియు చట్టాలలోని విషయాలను ప్రాముఖ్యంగా తెలిపి వాటి ప్రభావాలు విద్యార్థులకు తెలిసేటట్టుగా చెప్పాలని వారు సూచించారు . ప్రతి విద్యార్థికి న్యాయ వ్యవస్థలోని పలు అంశాలు మరియు న్యాయం వెలువరించే మార్గాలను తెలియపరచి నట్లయితే చాలా లాభ దాయకంగా ఉంటుందని ప్రత్యేకంగా సమయం చాలా ఆదా చేయవచ్చునని వారు . చెప్పారు . అంతర్జాతీయ న్యాయస్థానం వారు ఈ కార్యక్రమాన్ని చాలా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తునరని ప్రశంసిస్తూ ప్రపంచ వ్యాప్తంగా ఈ కార్యక్రమం పట్ల అవగాహన పెంపొందించి న్యాయాన్ని అందరికి అందించాలని సూచించారు . సందర్శనలో భాగంగా విద్యార్థులు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎర్రం రాజిరెడ్డి , సీనియర్ న్యాయవాదులు నరేందుల రాజేంద్ర ప్రసాద్ , లెక్కల రాంరెడ్డి , సుధాకర్ రావు మరియు పలువురు న్యాయవాదులను కలసి అంతర్జాతీయ దినోత్సవ శు భకాంక్షలు తెలియజేసారు మరియు వారి సేవలను కొనియాడారు . ఈ కార్యక్రమంలో సాంఘిక శాస్త్ర ఉ పాధ్యాయులు , పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు .

# లేబర్ కార్యాలయంలో అధికారులు లేక కార్మికులకు ఇబ్బందులు..ఏఐటియుసి నాయకుడు కదారి రాములు



రాజన్న సిరిసిల్ల, జులై 18 (నేటినిజం ప్రతినిధి): లేబర్ కార్యాలయంలో అధికారులు లేక కార్మికులకు ఇబ్బందులు పడుతున్నారని ఏఐటియుసి భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కదారి రాములు అన్నారు. ఈ సందర్భంగా సోమవారం వేములవాడలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ లేబర్ ఆఫీసర్లు కార్యాలయంలో ఉండడం లేదని మండిపడ్డారు. కార్మికుల ప్రింటింగ్ పైల్స్, డెత్ స్కై, నార్మల్ డెత్ డెలివర్, అరుగులైన వారికి లేబర్ కార్డులు ఇవ్వడం లేదన్నారు. అర్హులు కాని వారికి లేబర్ కార్డు ఇవ్వడం జరుగుతున్నదని, కానీ అర్హులైన కార్మికులకు లేబర్ కార్డు ఇవ్వడం లేదని అన్నారు. చనిపోయిన కార్మికులకు లబ్ధి రావడం లేదని, ఎన్నో నిరుపేద కుటుంబాలు, కార్మికుల కుటుంబాలు రోడ్డున వడ్డా అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఆన్లైన్ చాలన్ చేసిన, అప్లోడ్ చేయడం లేదని, నిజమైన కార్మికుల కార్డ్స్ లాప్స్ అయిపోతున్న అధికారులు అప్లోడ్ చేయడం లేదన్నారు. ఎన్నో చాలాలు కార్డులు నిజమైన కార్మికులై పట్టించుకోవడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో తుమ్మ లక్ష్మణ్, మహేందర్ మండా దేవయ్య, రాజు, శీను, కార్మికులు పాల్గొన్నారు.

# మూడు కీలక పదవుల నుంచి తప్పుకున్న నరీందర్ బత్ర

న్యూఢిల్లీ, జులై 18: భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు నరీందర్ బత్ర సంచలన నిర్ణయం తీసుకున్నారు. మూడు వేర్వేరు అత్యున్నత క్రీడా సంఘాలలో కీలక సభ్యుడిగా ఉన్న ఆయన మూడింటి నుంచి తప్పుకున్నారు. ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ (ఐవోఏ), ఇంటర్నేషనల్ హాకీ ఫెడరేషన్ (ఎఫ్ఐహెచ్), ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీ లలో కీలక బాధ్యతలకు ఆయన రాజీనామా చేశారు.

నరీందర్ బత్ర.. ఐవోఏ, ఎఫ్ఐహెచ్ అధ్యక్షుడిగా ఉండగా ఐవోసీలో కీలక సభ్యుడి (కౌన్సిల్ మెంబర్)గా వ్యవహరిస్తున్నారు. ఈ మూడు పదవులకు ఆయన ఏకకాలంలో రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం తన రాజీనామా లేఖలను సంబంధిత అధికారులకు పంపారు. తన స్వహస్తాలతో రాసిన రాజీనామా లేఖలను ఆయన ఐవోఏ, ఎఫ్ఐహెచ్, ఐవోసీ లకు పంపించారు. 'వ్యక్తిగత కారణాల రీత్యా నేను నా రాజీనామాను సమర్పిస్తున్నాను. ఇన్నాళ్లు మీరు ఇచ్చిన మద్దతుకు ధన్యవాదాలు' అని లేఖలలో పేర్కొన్నారు. బత్ర.. ఐవోఏ లో 2017 నుంచి, ఎఫ్ఐహెచ్ కు 2021 నుంచి అధ్యక్షుడిగా (రెండోసారి) కొనసాగుతున్నారు. ఐవోసీలో కౌన్సిల్ మెంబర్ గా 2019 లో ఎన్నికయ్యారు.

కాగా ఐవోసీలో ఆయనను 'లైఫ్ టైమ్ మెంబర్' గా నియమించడం నేషనల్ స్పోర్ట్స్ కోడ్ కు వ్యతిరేకంగా ఉందని ఇటీవలే ఢిల్లీ హైకోర్టు వెల్లడించింది. దీంతో ఆయన రాజీనామా చేయక తప్పలేదు.

**IN THE COURT OF THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL-CUM-XXVII ADDL CHIEF JUDGE: C.C.C. AT SECUNDERABAD**
**I.A. NO.474 OF 2019**
**In**
**O.P.NO.236 OF 2018**

Between:
**Smt. Kandukuri Shiva Rani & Another**
.....Petitioners
**And**
**Mr. S. Joel Prem Kumar & Another**
..Respondents

To
R-2, Mr. Dasari Bala Kishore
S/o. D. Raju
(Owner of the vehicle),
Aged about:Major,
Occ:Pvt Employee
R/o. H.No. 17-38/B,
Srinagar Colony
Dilsukhnagar, Saroornagar
Hyderabad.

**NOTICE**

Please take notice that in the above matter the Petitioner had filed a case against you (Respondent No.2) for compensation of Rs. 8,00,000/- and the same is posted for your appearance on **03-08-2022.**

You are advised to appear on **03-08-2022** at 10.30 a.m. before the said court either in person or through an Advocate failing which, the case will be decided exparte.

(BY ORDER OF THE COURT)

**M/S. EMMADI SRINIVAS REDDY**
**BANDI KALAVATHI**
**GODUGU KRISHNA**
Advocates.
# H.No.12-11-1556/AB
Flat No.001, Harika Enclave
Boudha Nagar,
Warasiguda
Secunderabad-61
Cell: 9676301324
7675975689

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.